https://epaper.dksaardyamlochaatimpu.com

E-mail: dkchaatimpu80@gmail.com RNI. NO. APTEL/2008/26737



డీకే సారథ్యంలో

చాటింపు

తెలంగాణ దిన పత్రిక

హైదరాబాద్ సంపుటి : 18 సంచిక : 52 ఎడిటర్ : పూసాల శ్రీనివాస్ మంగళవారం,నవంబర్,24, 2026 పేజీలు : 8 వెల : రూ.1/-

నేపాల్‌కు భారత్ భారీ కానుక..

రూ.15,000 కోట్ల అభివృద్ధి ప్యాకేజీ

- ప్రధాని మోదీ, నేపాల్ ప్రధాని బాలేన్ షా మధ్య ఫలవంతమైన చర్చలు- రెండు దేశాల మధ్య 8 కీలక అవగాహన ఒప్పందాలపై సంతకాలు- కష్టకాలంలో భారత్ అండగా నిలుస్తుందని నేపాల్ ప్రధాని ప్రశంస-రోడ్, రైల్, సరిహద్దు కనెక్టివిటీ పెంచాలని ఇరు దేశాల నిర్ణయం



న్యూఢిల్లీ,నవంబర్,23 :భారత్, నేపాల్ మధ్య దశాబ్దాలుగా కొనసాగుతున్న స్నేహ సంబంధాలు మరింత బలపడ్డాయి. నేపాల్ అభివృద్ధికి, పునర్నిర్మాణానికి మద్దతుగా నిలుస్తూ భారత ప్రభుత్వం భారీ ఆర్థిక ప్యాకేజీని ప్రకటించింది. నేపాల్ ప్రధాని బాలేన్ షాతో న్యూఢిల్లీలో జరిగిన ద్వైపాక్షిక సమావేశం అనంతరం, ప్రధాని నరేంద్ర మోదీ రూ. 24,000 కోట్ల నేపాలీ రూపాయల (సుమారు రూ. 15,000 కోట్లు) అభివృద్ధి ప్యాకేజీని అందిస్తున్నట్లు వెల్లడించారు. ఈ నిర్ణయం ఇరు దేశాల మధ్య సహకారానికి కొత్త అధ్యాయాన్ని లిఖించింది. నేపాల్ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించాక బాలేన్ షా భారత్‌లో పర్యటించడం ఇదే తొలిసారి. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. “భారత్, నేపాల్ కేవలం పొరుగు దేశాలు మాత్రమే కాదు. మన బంధం విశ్వాసం, స్నేహంతో ముడిపడి ఉంది. కష్టసుఖాల్లో ఒకరికొకరం అండగా నిలుస్తాం” అని అన్నారు. నేపాల్ యువత ఆశలు, ఆకాంక్షలకు బాలేన్ షా నాయకత్వం నిదర్శనమని, ఆయన దార్శనికతను ప్రశంసించారు. రెండు దేశాల మధ్య రోడ్, రైల్, సరిహద్దు కనెక్టివిటీని మరింత పెంచాలని నిర్ణయించినట్లు మోదీ తెలిపారు. ఇటీవల నేపాల్‌ను అతలాకుతలం చేసిన వరదల్లో ప్రాణాలు కోల్పోయిన వారికి ఆయన ప్రగాఢ సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా నేపాల్ ప్రధాని బాలేన్ షా మాట్లాడుతూ.. భారత్ అందించిన ఆత్మీయ ఆతిథ్యానికి ధన్యవాదాలు తెలిపారు. “భారత్, నేపాల్ బంధం హిమాలయాలంత దృఢమైనది, సముద్రమంత విశాలమైనది. మన మధ్య ఉన్న సాన్నిహిత్యాన్ని మాటల్లో వర్ణించలేం. కష్టకాలంలో, ప్రకృతి వైపరీత్యాల సమయంలో భారత్ ఎల్లప్పుడూ మాకు అండగా నిలుస్తుంది. అందుకు భారత ప్రభుత్వానికి, ప్రజలకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు” అని అన్నారు.

అనంతరం ఆయన ప్రధాని మోదీని నేపాల్ పర్యటనకు రావాల్సిందిగా ఆహ్వానించారు. ఈ సమావేశంలో భాగంగా ఇరు దేశాల మధ్య 8 కీలక అవగాహన ఒప్పందాలు (ఎంఓయూ) జరిగాయి. సివిల్ సర్వీస్ సామర్థ్య శిక్షణ, అంతరిక్ష పరిశోధన, ఆరోగ్యం, వైద్యం, పట్టణాభివృద్ధి, ఆయుర్వేదం, సాంప్రదాయ వైద్యం వంటి రంగాల్లో పరస్పర సహకారం కోసం ఈ ఒప్పందాలు కుదిరాయి. దీంతో పాటు ఇంధనం, కనెక్టివిటీకి సంబంధించిన పలు కీలక ప్రాజెక్టులను ఇరు దేశాల ప్రధానులు సంయుక్తంగా ప్రారంభించారు. కొన్ని కొత్త ప్రాజెక్టులకు శంకుస్థాపన కూడా చేశారు. ‘నైబర్‌హుడ్ ఫస్ట్’ విధానంలో భాగంగా చమురు సరఫరాలో సవాళ్లు ఎదురైనప్పటికీ నేపాల్‌కు ఇంధనం, ఎరువులు, ఇతర నిత్యావసరాలను నిరంతరాయంగా అందించామని మోదీ గుర్తుచేశారు.

బీఆర్ఎస్ హయాంలో మాటలు ఎక్కువ.. పని తక్కువ..

కాంగ్రెస్‌లో అందుకు భిన్నం: ఉత్తమ్

గాంధీ భవన్‌తో సెంటిమెంటల్, ఎమోషనల్ అటాచ్మెంట్ ఉందని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. కష్టకాలంలో ఏడేళ్ల పాటు పీసీసీ చీఫ్‌గా పని చేసినట్లు తెలిపారు.



హైదరాబాద్,నవంబర్,23 :హైదరాబాద్‌లోని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయం గాంధీ భవన్‌తో తనకు ఎంతో అనుబంధం ఉందని రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. గాంధీ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ నూతన ఇన్‌ఛార్జ్ బీఎం సందీప్‌తో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు భేటీ అయ్యారు. పార్టీ అంతర్గత వ్యవహారాలతో పాటు తాజా రాజకీయ పరిణామాలపై వీరు చర్చించారు. ఈ భేటీ అనంతరం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో ఉన్న సమయంలో తాను ఏడేళ్ల పాటు పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తించిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. “గాంధీ భవన్‌తో సెంటిమెంటల్, ఎమోషనల్ అటాచ్మెంట్ ఉంది” అని ఆయన వ్యాఖ్యానించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పూర్తి నిబద్ధతతో పనిచేస్తున్నామని స్పష్టం చేశారు. “నా శాఖలో అద్భుతమైన పని జరుగుతోంది.

ఒక్క రోజు, ఒక్క గంట కూడా విరామం లేకుండా పని చేస్తున్నా” అని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ తీరుపై కూడా ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర విమ ర్శలు గుప్పించారు. “బీఆర్ఎస్ హయాంలో మాటలు ఎక్కువ, పని తక్కువ” అని విమర్శించారు. నాటి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ బోగస్ అని కొట్టిపారేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాటల కంటే చేతలకే ప్రాధాన్యం ఇస్తోందని, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతోందని చెప్పారు. ఇదే క్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, పార్టీ వ్యవహారాలపై ఇన్‌ఛార్జ్‌తో చర్చించామని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని అధిష్ఠానం దిశానిర్దేశం చేసిందని వెల్లడించారు.

ఎప్పుడు ఎన్నికలు జరిగినా

కోటి ఓట్లు, 90 సీట్లు సాధిస్తాం

పీసీసీ మహేశ్ కుమార్ గౌడ్



హైదరాబాద్,నవంబరు 23: రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా కోటిఓట్లు..90సీట్లను తప్పక సాధిస్తామని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. ఈ నెల 26న సంవిధాన్ రాలీని నిర్వహిస్తున్నామని.. పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, నేతలు పాల్గొనాలని ఆయన కోరారు. గాంధీభవన్‌లో జరిగిన కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల సమావేశంలో పీసీసీ చీఫ్ మహేశ్ భగవత్ ప్రసంగించారు.

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలను దేశంలో వేరే ఏరాష్ట్రాల్లోనూ ఇవ్వడం లేదని పేర్కొన్నారు. ‘కోటి ఓట్లు-తొంభై సీట్లు’ అనే నినాదంతో కాంగ్రెస్ ముందుకు పోతోందని.. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా..కోటి ఓట్లు,90 సీట్లను తప్పకుం డాసాధిస్తా మని ఆయన పేర్కొన్నారు. కాగా..ఈనెల 26వ తేదీన లిబర్టీ నుంచి అబిడ్స్ నెహ్రూ విగ్రహం వరకు సంవిధాన్ ర్యాలీ ర్వహిస్తున్నా మని.. ప్రజలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ర్యాలీని విజయవం తం చేయాలని మహేశ్ కుమార్ గౌడ్ కోరారు. ఆయన ప్రత్యేకంగా నూతన ఏఐసీసీ ఇన్‌చార్జ్ సందీప్ కుమార్‌తో భేటీ కాలేదని.. భేటీ అయ్యాక అన్నీ విషయాల గురించి చర్చిస్తామని మహేశ్ తెలిపారు.

రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం ఏం చేసిందో

కిషన్ రెడ్డి, బండి సంజయ్ చెప్పాలి

కోమటిరెడ్డి డిమాండ్-రీజినల్ రింగ్ రోడ్డు ప్రాజెక్టు కేబినెట్ ఆమోదంపై బీజేపీ నేతలు స్పష్టత ఇవ్వాలని నిలదీత

హైదరాబాద్,నవంబర్,23 :రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎలాంటి ప్రజావ్యతిరేకత లేదన్న మంత్రి కోమటిరెడ్డికేంద్ర హోంమంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నితిన్ నబీన్ తెలంగాణ పర్యటనల నేపథ్యంలో రాష్ట్రరోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి బీజేపీపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తెలంగాణ రాష్ట్రానికి ఏం చేసిందో కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.ఏ మొహం పెట్టుకుని అమిత్ షా,నితిన్ నబీన్ తెలంగా ణకు వస్తున్నారని మంత్రి ప్రశ్నించారు. తాను స్వయంగా కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో మాట్లాడి రీజినల్ రింగ్ రోడ్డు ప్రాజెక్టును మంజూరు చేయిస్తే... దానికి కేంద్ర కేబినెట్‌లో ఆమోదం తెలపకుండా ఇప్పటికీ ఎందుకు పెండింగ్‌లో పెట్టారో బీజేపీ నేతలు స్పష్టం చేయాలని ఆయన నిలదీశారు.రాష్ట్రానికి సంబంధించిన కీలక ప్రాజెక్టుల పురోగతిపై కేంద్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోమటిరెడ్డి పేర్కొన్నారు. అదే సమయంలో



తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో ఎటువంటి వ్యతిరేకత లేదని ఆయన స్పష్టం చేశారు. బీజేపీ అగ్రనేతలు రాష్ట్రంలో పర్యటనలకు సిద్ధమవుతున్న క్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

భయాందోళనలకు గురికావద్దు..

బాంబు బెదిరింపులపై సీపీ మహేశ్ భగవత్ కీలక ప్రకటన



హైదరాబాద్, నవంబరు 23: హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో బాంబు పేలుళ్ల బెదిరింపులపై సీపీ మహేశ్ భగవత్ స్పందించారు. ప్రజలందరూ ఎటువంటి భయాందోళనలకు గురి కావద్దని, నగర వ్యాప్తంగా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టామని సీపీ స్పష్టం చేశారు.‘బాంబు బెదిరింపుల అంశంపై భయాందోళనలకు గురికావద్దు. నగర వ్యాప్తంగా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాం. కాచిగూడ రైల్వే స్టేషన్, హోటల్ టూరిస్ట్ ప్లాజా వద్ద భద్రతను రెట్టింపు చేశాం. ఇప్పటికే ఈ బెదిరింపుల మెయిల్‌కు సంబంధించి.. సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశాం. మెయిల్ ఎక్కడ నుంచి వచ్చింది. ఎవరు పంపించారు. అనే కోణంలో దర్యాప్తు చేపట్టాం. అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు కనిపిస్తే వెంటనే.. 112కి కాల్ చేసి సమాచారం ఇవ్వండి’ అంటూ సీపీ కోరారు.

అండాల అక్రమ సేకరణ కేసు.. హైకోర్టులో డాక్టర్లకు ఎదురుదెబ్బ



హైదరాబాద్, నవంబర్ 23: అండాల అక్రమ సేకరణ కేసులో డాక్టర్లకు తెలంగాణ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసుకు సంబంధించి డాక్టర్ పద్మజ, డా.దుర్గారావు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్ల న్యాయస్థానం డిస్మిస్ చేసింది. పలు పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసుల్లో తమనుఅరెస్టు చేయకుండా ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని డాక్టర్లు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ కేసుతో పిటిషనర్లకు ఎలాంటి సంబంధం లేదని వారి తరఫు న్యాయవాదులు వాదించారు. అయితే, అమాయక యువతులకు హార్మోన్ ఇంజెక్షన్లు ఇచ్చి వారి నుంచి అండాలు సేకరించారని పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వర్ రావు కోర్టుకు వివరించారు.

కూకట్‌పల్లిలో హుడా ట్రక్ పార్కింగ్ స్థలం

వేలాన్ని వ్యతిరేకిస్తూ ఈటల రాజేందర్ ధర్నా

- ప్రభుత్వ భూములను రియల్ ఎస్టేట్ తరహాలో అమ్మడం సరికాదన్న ఈటల రాజేందర్
- నియోపోలిస్, గచ్చిబౌలి, - ఐడీఎల్ భూముల వ్యవహారాలపై విచారణకు డిమాండ్
- భావితరాల కోసం ప్రభుత్వ భూములను కాపాడాలని వ్యాఖ్య



హైదరాబాద్,నవంబర్,23 :ప్రభుత్వ భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారుల మాదిరిగా విక్రయించడం ఎంతమాత్రం సరికాదని మల్కాజిగిరి బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని వై జంక్షన్ మెట్రో వద్ద ఉన్న ఉన్న హుడా ట్రక్ పార్కింగ్ స్థలాన్ని ప్రభుత్వం వేలం వేయడాన్ని వ్యతిరేకిస్తూ బీజేపీ మేడ్చల్ మల్కాజిగిరి అర్బన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిరసన ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొన్నారు.

ప్రజావసరాల కోసం కేటాయించిన భూములను ప్రభుత్వం ఇలా వేలం వేసుకుంటూ పోతే భవిష్యత్తులో ప్రజలకు, రాబోయే తరాలకు ఖాళీ స్థలాలే లేకుండా పోతాయని ఈటల రాజేందర్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు ప్రజా ప్రయోజనాల కోసం ఆలోచించాలి తప్ప, ఆదాయం కోసం భూములు అమ్మే వ్యాపార సంస్థల్లా వ్యవహరించకూడదని ఆయన హితవు పలికారు. పేదలకు కేటాయించిన అసైన్డ్ భూములతో పాటు ప్రజావసరాల కోసం ఉద్దేశించిన స్థలాలను ప్రభుత్వం బాధ్యతాయుతంగా కాపాడాలని స్పష్టం చేశారు.

రాష్ట్రంలోని కీలక ప్రాంతాల్లో జరిగిన భూ కేటాయింపులపై ఆయన పలు అనుమానాలు వ్యక్తం చేశారు. నియోపోలిస్, గచ్చిబౌలి, ఐడీఎల్, ఎల్లమ్మబండ, భాగ్యనగర్ పరిధిలోని వివాదాస్పద భూముల వ్యవహారాలపై వెంటనే సమగ్ర విచారణ జరిపించాలని ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడే వరకు తమ పోరాటం కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో బీజేపీ స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విజయవాడ మేయర్‌గా

ప్రమాణ స్వీకారం చేసిన వంగవీటి రాధాకృష్ణ

అమరావతి,నవంబర్,23 : విజయవాడ నగర పాలక సంస్థ (వీఎంసీ) మేయర్‌గా జనసేన పార్టీ నేత వంగవీటి రాధాకృష్ణ ప్రమాణ స్వీకారం చేశారు. ఎన్నికల అధికారి హోదాలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి. లక్ష్మీశా.. నూతన మేయర్‌గా వంగవీటి రాధాకృష్ణతో ప్రమాణం చేయించారు. మేయర్ ప్రమాణ స్వీకారం పూర్తయిన తర్వాత, నగరంలోని 86 డివిజన్ల నుంచి కొత్తగా ఎన్నికైన కార్పొరేటర్లతో కలెక్టర్ వరుసగా ప్రమాణం చేయించారు. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయవాడ నగర పాలక సంస్థపై ఎన్డీయే కూటమి పూర్తి ఆధిపత్యం సాధించినన సంగతి తెలిసిందే. మొత్తం 86 డివిజన్లలో కూటమి ఏకంగా 76 స్థానాలను కైవసం చేసుకుంది. ఇందులో టీడీపీ 53 డివిజన్లు, జనసేన పార్టీ 19 డివిజన్లు, బీజేపీ 4 డివిజన్లలో విజయం సాధించాయి. ప్రతిపక్ష వైసీపీ 8 డివిజన్లకే పరిమితం కాగా, సీపీఎం ఒకటి, స్వతంత్ర అభ్యర్థి ఒక స్థానంలో గెలుపొందారు. మేయర్, కార్పొరేటర్ల ప్రమాణ స్వీకారం



పూర్తి కావడంతో విజయవాడ నగరంలో నూతన పాలకమండలి అధికారికంగా కొలువుదీరినట్లైంది. తదుపరి నిర్వహించే ప్రత్యేక సమావేశంలో కొత్త డిప్యూటీ మేయర్‌ను కార్పొరేటర్లు ఎన్నుకోనున్నారు.

స్నేహ సొసైటీ లో విలీన విద్య కేంద్రం

ప్రారంభిం చిన పోలీసు కమిషనర్

నిజామాబాద్ ప్రతినిధి నవంబర్ 23 (డీకే చాటింపు): నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని తారక రామా నగర్ లో స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీ కన్స్ట్రక్షన్ ఆధ్వర్యం లో నూతనంగా ఏర్పాటు చేసిన విలీన విద్యా కేంద్రం,ఆటిజం, హైపర్ ఆక్టివ్ డిసార్డర్ మరియు చదువులో వెనుకబాటుతనం విద్యార్థుల ఉన్నతి కోసం నూతనంగా ఏర్పాటు చేసిన నూతన విలీన విద్య కేంద్రం నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, ప్రారం భించారు.అనంతరం నూతన భవనంలోని తరగతి గదులను ప్రారంభించారు. తదుపరి దివ్యాంగ విద్యార్థులకు అందించే విద్య మరియు ఇతర విషయాలను భవనం లోని తరగతి గదులను పరిశీలించి ఏ విధంగా వారికి వ్యాయామం, శిక్షణ మరియు విద్య అందిస్తున్నారు అని ఉ పాధ్యాయులను మరియు సిబ్బందిని అడిగి తెలుసుకున్నా రు. భగవంతుడు మన కు ఏ విధంగా జన్మని చ్చినప్పటికీ మనకు అంగవైకల్యం , మాన సిక బుద్ధిమాంద్యం లాంటివి ఉన్నాయని బాధపడాల్సిన అవ సరం లేదన్నారు. భగవంతుడు ఇచ్చిన జన్మలో మనం ఏం సాధించ గలుగుతా మని అనే దిశగా అడు గులు వేసి ముందుకు వెళ్లాలని మనో ధైర్యా న్ని కల్పించారు. అదేవిధంగా ముఖ్యం గా తల్లిదండ్రులు తమ పిల్లలు అంగవైకల్యంతో జన్మించారని నిరుత్సా హపడరాదని తెలిపా రు. ముఖ్యంగా వారిని జన్మించిన తరువాత వారి నడవడికను గమనించి సరైన వైద్యు లచే వైద్యంతో పాటు సదరు బాలుడు ఆసక్తి ఏ వైపు చూపుతు న్నాడో గమనించి ఆ దిశగా సరైన ప్రోత్సాహా న్ని అందిస్తే ఉన్నత శిఖరాలు సైతం అధిరో హించడం సాధ్యమవు తుందన్నారు.. ఒక ఇంట్లో ఒక్కరు దివ్యాంగుడు ఉన్నప్ప టికీ భరించలేక నిర్లక్ష్యం వహించిన ఘటనలు లేకపోలేదు అన్నారు.




అలాంటిది ఒక మాన సిక దివ్యాంగ విద్యా ర్థుల ఉన్నతి కోసం కొన్ని సంవత్సరాలుగా వారి నడవడికను గమనిస్తూ వారి తల్లిదండ్రుల ప్రోద్బలం తో దివ్యాంగుల ఉన్నతి కోసం కృషి చేస్తున్న స్నేహ సొసైటీ వ్యవ స్థాపకులు సిద్దయ్య, జ్యోతి దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు. తమ పోలీస్ శాఖ తరపున సైతం దివ్యాంగుల ఉన్నతి కోసం తమ వంతు సహాయ సహకారాలు అందజేస్తామని సూచించారు. పోలీస్ శాఖకు సంబంధించి సమావేశాలు ఏర్పాటు చేసుకోని పోలీస్ పనితీరు అలాగే పోలీస్ శాఖ ఏ విధంగా పనిచేస్తుందని విషయాలు పట్ల విద్యార్థులకు కూడా తెలియపరుస్తామని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిని సౌందర్య, లోకల్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కొండారెడ్డి వైస్ చైర్మన్ కనకయ్య మానసిక వికలాంగుల పాఠశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరి విద్యార్థులతల్లి దండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా

కల్పించడమే ఇందిరమ్మ బీమా పథకం

-నారాయణపేట మున్సిపాలిటీలో 7,8వ, వార్డుల్లో పథకాన్ని ప్రారంభించిన కౌన్సిలర్,కాంగ్రెస్ పార్టీ డీసీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి...

నారాయణపేట,(డీకే చాటింపు): ప్రజా సంక్షేమమే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మరో ప్రతిష్టాత్మక పథకానికి శ్రీకారం చుట్టిందని నారాయణపేట మున్సిపాలిటీ ఏడోవ వార్డు కౌన్సిలర్ సత్యమ్మ,కాంగ్రెస్ పార్టీ డీసీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి,మున్సిపల్ మాజీ కౌన్సిలర్ ఎండీ సలీం తెలిపారు.నారాయణపేట జిల్లా కేంద్రంలోని అశోక్ నగర్ కమ్యూనిటీ హాల్లో సోమవారం ఏడు,ఎనిమిదవ వార్డుల్లో ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణిక రెడ్డి ఆదేశాల మేరకు ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి నిరుపేద కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా ద్వారా ఆర్థిక భరోసా కల్పించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. కుటుంబాన్ని పోషించే వ్యక్తి అనుకోని పరిస్థితుల్లో మరణిస్తే ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా ఉండేందుకు ఈ పథకం అండగా నిలుస్తుందని పేర్కొన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం ఇప్పటికే అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ పేద ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తోందన్నారు. నారాయణపేట నియోజకవర్గంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని తెలిపారు.ప్రభుత్వం



అమలు చేస్తున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి కుటుంబానికి వాటి ప్రయోజనాలు అందేలా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు.ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను ప్రతి ఇంటికీ చేరవేయడమే తమ లక్ష్యమని వారు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు రహమాన్, సౌమ్య,ఆర్పీలు పుష్ప,జ్యోతి,వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

బోయిన్ పల్లి తండాలో ఇందిరమ్మ కుటుంబ భీమా జీవిత పథకం ప్రారంభం

-పథకంపై ప్రజలకు అవగాహన కల్పించిన గ్రామ సర్పంచ్ లక్ష్మణ్ నాయక్...



నారాయణపేట,(డీకే చాటింపు): నారాయణపేట మండలం బోయిన్ పల్లి తండాలో ఇందిరమ్మ కుటుంబ భీమా జీవిత పథకాన్ని ఆ గ్రామ సర్పంచ్ లక్ష్మణ్ నాయక్ సోమవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ లక్ష్మణ్ నాయక్ మాట్లాడుతూ ఈ పథకం ద్వారా అర్హులైన కుటుంబాలకు భద్రత కల్పించడమే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ బృహత్తర పథకాన్ని చేపట్టినట్లు తెలిపారు. కుటుంబ భీమా పథకంపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అంజనేయులు గౌడ్,వార్డు సభ్యులు రమేష్ నాయక్,గోపాల్ నాయక్,రవి నాయక్,శ్రవణ్ నాయక్, గోవిందు నాయక్,వెంకట్ నాయక్,రాజు నాయక్, హరిచందర్,భాస్కర్ నాయక్,కేమ్యా నాయక్,పిత్య నాయక్,లక్ష్మణ్,గణేష్,కల్యా నాయక్,రాందాస్ నాయక్, కృష్ణ నాయక్, ఛత్రియనాయక్,నందు, లోక్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేడే లింబాద్రిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి రథోత్సవం





ఆర్మూర్ విలేఖరి నవంబర్ 23 (డీకే చాటింపు): నిజామాబాద్ జిల్లాలో సుప్రసిద్ధ లింబాద్రిగుట్ట లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం మంగళ వారం వైభవంగా జరగనున్నది. భీంగల్ సమీపంలో గల ఈ ఆలయం లింబాద్రిగుట్టగా ప్రసిద్ధి చెందగా వేలాది మంది భక్తులు తరలివచ్చి ఈ రథంయాత్రలో పాల్గొం టారు. ప్రతి కార్తీక పౌర్ణమి సందర్భంగా వారం రోజుల పాటు విశేష పూజలు భక్తులు చేస్తుంటారు. రథోత్స వం సందర్భంగా భక్తు లకు ఉచిత దర్శనం మాత్రమే అందుబాటు లో ఉంటుందని ఆలయ ప్రధాన పూజా రులు తెలిపారు.శ్రీ నింభాచల లక్ష్మీ నరసింహస్వామి ఆలయం భక్తులతో అనునిత్యం కిటకిట లాడుతూ ఉంటుంది. వైశ్య సత్రం ఆధ్వర్యం లో నిత్యం అన్నదానా లుకొనసాగుతున్నాయిక్షేత్రానికి తెలంగాణ ఆంధ్ర కర్ణాటక మహా రాష్ట్ర ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా వచ్చి దర్శనం చేసుకుంటు న్నారు. రథయాత్ర సందర్భంగా పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి, జిల్లా ఇంచార్జి మంత్రి ధనసరి అనసూయ సీతక్క శుక్రవారం శాసన మండలి సభ్యులు బి. మహేష్ కుమార్ గౌడ్ తో కలిసి భీమ్గల్ మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన లింబాద్రి గుట్టను సందర్శించి, శ్రీ లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకున్నారు. ఆలయ చరిత్రను ఆలకించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆలయం వద్ద రూ.4 కోట్ల నిధుల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించనున్న వసతి గృహానికి మంత్రి శంకుస్థాపన చేశారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ భుజంగరావు, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మంత్రి సీతక్కకు పూల మొక్క అందించి ఘన స్వాగతం పలుకుగా, లక్ష్మీ నరసింహస్వామి ఆలయ ధర్మకర్త ఆలయ సంప్రదాయాన్ని అనుసరిస్తూ మంత్రికి స్వామివారి పట్టు వస్త్రాలు సమర్పించారు.

నాయకులను వదిలి, చిరు ఉద్యోగుల పై చర్యలా..

మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య.

బెల్లంపల్లి (డీకే చాటింపు) ఫెక్ డెత్ సర్టిఫికెట్ ల ఘటన లో నాయకులను వదిలి, చిన్న ఉద్యోగుల పై చర్యలు ఏంటి అని మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. సోమవారం పట్టణంలోని కార్యాలయంలోమాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యమాట్లాడుతూ ఇటీవల బెల్లంపల్లి మండలంలో నకిలీ డెత్ సర్టిఫికెట్ల మంజూరు వెనుక ఉన్న కాంగ్రెస్ నాయకులను వదిలేసి చిన్న ఉ ద్యోగులపై చర్యలు తీసుకున్న జిల్లా కలెక్టర్, పోలీసులు, సంబంధిత అధికారులు పూర్తిగా కాంగ్రెస్ పార్టీకి తొత్తులుగా మారి కాంగ్రెస్ నాయకులను రక్షిస్తున్నారని విమర్శించారు. అక్రమ అరెస్ట్ అయిన వారు బహిరంగంగానే నకిలీ డెత్ సర్టిఫికెట్ల ముఠా పేరు తెలుపుతున్నా సంబంధిత అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనమని, బెల్లంపల్లి నియోజకవర్గం ఈ నిర్లక్ష్యం వల్లనే భూకబ్జాలు, నకిలీ ధ్రువీకరణ పత్రాలు, అక్రమ, అసాంఘిక కార్యకలాపాలు అనునిత్యం జరుగుతున్నాయని తెలిపారు. ఇదంతా స్థానిక ఎమ్మెల్యే ప్రోద్బలంతోనే జరుగుతున్నందున వారు మౌనంగా ఉన్నారని తెలిపారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, ప్రస్తుత ప్రభుత్వం



అధికారంలో ఉండేది కేవలం ఇంకా రెండు సంవత్సరాలు మాత్రమే అని, ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులు నకిలీ డెత్ సర్టిఫికెట్ల వెనుక ఉన్న ముఠాపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో రానున్న కాలంలో జరిగేదానికి వారే బాధ్యులు అవుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మున్సిపల్ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ 30 లోపు ఉద్యమకారుల గుర్తింపు

ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం

(డీకే చాటింపు,హైదరాబాద్): తెలంగాణ ఉద్యమకారుల సమస్యల పరిష్కారం, గుర్తింపు ప్రక్రియ వేగవంతం చేయడంపై తెలంగాణ యునైటెడ్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీయూజేఏసీ) ప్రతినిధులు సోమవారం కీలక భేటీలు నిర్వహించారు. టీయూజేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, ఉద్యమ గుర్తింపు కమిటీ సభ్యులు మోతే శోభన్ రెడ్డిలను వేర్వేరుగా కలిసి వినతిపత్రాలు అందజేసింది. ఈ సందర్భంగా ఉద్యమకారుల సంక్షేమం, గుర్తింపు కార్డులు, మరియు రూపొందించనున్న ప్రత్యేక మొబైల్ యాప్ విధివిధానాలపై సుదీర్ఘంగా చర్చించారు. దీనిపై ప్రొఫెసర్ కోదండరాం స్పందిస్తూ.. ఉ ద్యమకారుల కోసం ప్రత్యేక యాప్‌ను త్వరలోనే ప్రవేశపెడతామని, డిసెంబర్ 30వ తేదీ నాటికి ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను పూర్తి చేస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. మరోవైపు మోతే శోభన్ రెడ్డి మాట్లాడుతూ.. డిసెంబర్ 9 లోపే యాప్‌ను అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. అనంతరం టీయూజేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి మాట్లాడుతూ, ఈ యాప్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అధికారికంగా ప్రారంభించాలని కోరారు. అమరవీరుల కుటుంబాలకు తొలి ప్రాధాన్యత



ఇస్తూనే, మలిదశ ఉద్యమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ సమాన ప్రాతిపదికన ప్రభుత్వ ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఉ ద్యమకారులందరికీ న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు.కార్యక్రమంలో టీయూజేఏసీ రాష్ట్ర నాయకులు అన్వర్ పటేల్, మోత్కూరు మల్లేష్, జి. యాదగిరి, రవీంద్ర చారి, హనుమంతు, బి.ఎన్. జాంబవ్, అమర్, అంకం సతీష్, వి. అరుణ, లావణ్య, విజయలక్ష్మి, డి. కృష్ణ, గిరి, సి. దేవానంద్, పెంటమ్ నరసింహ, రాజ్ మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

రాధమ్మాస్ హౌస్ ఆఫ్ హ్యాండ్లూమ్స్ ఘనంగా ప్రారంభోత్సవం

రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి చిలుక మధుర ఉపేందర్ రెడ్డి

హైదరాబాద్, (డికే చాటింపు) మల్కాజ్ గిరి మున్సిపల్ కార్పోరేషన్(ఎమ్ ఎమ్ సి) పరిధిలోని ఆర్కే పురం డివిజన్, స్నేహపురి కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన రాధమ్మాస్ హౌస్ ఆఫ్ హ్యాండ్లూమ్స్ షోరూమ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి చిలుక మధుర ఉపేందర్ రెడ్డి షోరూమ్‌ను లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు చేనేత వస్త్రాలు ప్రతీకలని, చేనేత రంగానికి ప్రోత్సాహం అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. సంప్రదాయ చేనేత కళను ఆధునిక అభిరుచులకు అనుగుణంగా ప్రజలకు చేరువ చేయాలనే లక్ష్యంతో రాధమ్మాస్ హౌస్ ఆఫ్ హ్యాండ్లూమ్స్ ముందుకు రావడం అభినందనీయమన్నారు. చేనేత కార్మికులకు చేయూతనిస్తూ, మహిళలకు నాణ్యమైన చేనేత వస్త్రాలు, ఆకర్షణీయమైన చీరలను అందించాలనే సంస్థ యాజమాన్యం సంకల్పం ప్రశంసనీయమని అన్నారు. నూతనంగా ప్రారంభించిన ఈ వ్యాపారం దినదినాభివృద్ధి చెందుతూ



మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాధమ్మాస్ హౌస్ ఆఫ్ హ్యాండ్లూమ్స్ యజమానురాలు సింగిరెడ్డి మాధవి రెడ్డిబి గారు, కుటుంబ సభ్యులు, స్థానిక ప్రముఖులు, మిత్రులు, శ్రేయోభిలాషులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని నిర్వాహకులకు శు భాకాంక్షలు తెలియజేశారు.

ఎల్ నినో ఎఫెక్ట్...కొత్త జాబ్ కార్డు రెడీ



హైదరాబాద్, : ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో గ్రామీణ కూలీలకు నిరంతర ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త జాబ్‌కార్డులు జారీ చేయాలని నిర్ణయించింది. వీబీ జీరాంజీ పథకం కింద కొత్తగా దరఖాస్తు చేసుకునే వారికి 15 రోజుల్లోనే కార్డులు అందించాలని ఆదేశించింది. ఇప్పటికే 18 జిల్లాల్లోని 265 మండలాలను కరవు ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించారు. పంటల సాగు తగ్గడంతో కూలీలకు పనులు, ఆదాయం తగ్గిన నేపథ్యంలో ప్రతి గ్రామంలో రోజుకు 100 నుంచి 150 మందికి ఉపాధి కల్పించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో గ్రామీణ కూలీలకు నిరంతర ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వీబీ జీరాంజీ పథకం కింద కొత్తగా దరఖాస్తు చేసుకునే వారికి జాబ్‌కార్డులు త్వరగా జారీ చేయాలని నిర్ణయించింది. కొత్త దరఖాస్తుదారులకు 15 రోజుల్లోనే జాబ్‌కార్డు అందించేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితుల కారణంగా ఇప్పటికే 18 జిల్లాల్లోని 265 మండలాల్లో కరవు పరిస్థితులు ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది. ఆయా ప్రాంతాల్లో వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోవడంతో పంటల సాగు తగ్గింది. దీంతో వ్యవసాయ పనులపై ఆధారపడే కూలీలకు పనిదినాలు తగ్గి ఆదాయం కోల్పోయే పరిస్థితి ఏర్పడినట్లు ప్రభుత్వం నిర్ధారించింది.ఈ నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను పెంచేందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖలను ప్రభుత్వం అప్రమత్తం చేసింది. ప్రస్తుత జాబ్‌కార్డుదారులతో పాటు కొత్తగా ఉ పాధి కోరుకునే వారిని కూడా నమోదు చేయాలని సూచించింది. గ్రామాల్లో ఉపాధి అవసరమున్న కుటుంబాలను గుర్తించి వారికి పనులు కల్పించేలా కార్యాచరణ రూపొందిస్తోంది. ప్రతి గ్రామం నుంచి రోజుకు 100 నుంచి 150 మందికి ఉపాధి కల్పించేలా చర్యలు చేపట్టాలని పంచాయతీరాజ్ శాఖ నిర్ణయించింది. వ్యవసాయ పనులు తగ్గిన సమయంలో గ్రామీణ కుటుంబాలకు ప్రత్యామ్నాయ ఆదాయ వనరుగా ఉపాధి హామీ పనులు అందుబాటులో ఉండేలా అధికారులు ఏర్పాట్లు చేయనున్నారు. ముఖ్యంగా కరవు ప్రభావిత మండలాల్లో ఉపాధి కల్పనకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు.ప్రస్తుతం రాష్ట్రంలో 52.46 లక్షల కుటుంబాలకు చెందిన 1.08 కోట్ల మంది జాబ్‌కార్డులు కలిగి ఉ న్నారు. వీరికి కొనసాగుతున్న ఉపాధి అవకాశాలతో పాటు కొత్తగా పనులు కోరుకునే కుటుంబాలను కూడా పథకంలోకి తీసుకురావడం ద్వారా కరవు పరిస్థితుల్లో ఆదాయ నష్టాన్ని కొంతమేర తగ్గించాలన్నది ప్రభుత్వ ఉద్దేశంగా ఉంది. 18 ఏళ్లు నిండిన గ్రామీణులు జాబ్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందుకోసం నిర్ణీత దరఖాస్తు ఫారాన్ని పూర్తి చేసి ఆధార్‌కార్డు, ఫొటోను జత చేయాలి. సంబంధిత పత్రాలతో దరఖాస్తును గ్రామ పంచాయతీ కార్యదర్శికి సమర్పించాలి. కార్యదర్శి దరఖాస్తును పరిశీలించిన అనంతరం మండల కార్యాలయానికి పంపిస్తారు. మండల స్థాయిలో ఎంపీడీవో దరఖాస్తు, సంబంధిత పత్రాలను పరిశీలించి అర్హతను నిర్ధారిస్తారు. అనంతరం జాబ్‌కార్డు జారీ చేస్తారు. కొత్తగా దరఖాస్తు చేసుకునే వారికి ఈ ప్రక్రియను వేగవంతం చేసి 15 రోజుల్లోనే కార్డు అందించాలని ప్రభుత్వం ఆదేశించింది. వర్షాభావ పరిస్థితుల్లో వ్యవసాయ పనులు తగ్గినప్పటికీ గ్రామీణ కుటుంబాలకు ఉపాధి అవకాశాలు అందుబాటులో ఉండేలా చేయడం ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది. ముఖ్యంగా కరవు ప్రభావిత ప్రాంతాల్లో స్థానికంగా పనులు కల్పించడం ద్వారా కూలీలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లే అవసరాన్ని తగ్గించే అవకాశం ఉంది.

టార్గెట్ కమ్మ సామాజిక వర్గం!

గుంటూరు: ఏపీలో రాజకీయాలు అంటేనే సామాజిక సమీకరణలపై ఆధారపడి ఉంటాయి. ఇక్కడ సామాజిక వర్గాలు రాజకీయాలను శాసిస్తుంటాయి. ఫలానా కులం ఫలానా పార్టీ అని చాలా సులువుగా చెప్పవచ్చు. కమ్మ సామాజిక వర్గం అయితే తెలుగుదేశం, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అంటే రెడ్డి సామాజిక వర్గం.. కాపులంటే జనసేన.. ఇలా రకరకాలుగా విశ్లేషించుకోవచ్చు. అయితే ఒక రాజకీయ పార్టీకి బలమైన మద్దతుదారులుగా సామాజిక వర్గాలు ఉంటాయి. ఇవి సహజం కూడా. అయితే కొన్ని సామాజిక వర్గాలు కొన్ని పార్టీలను విపరీతంగా ద్వేషిస్తుంటాయి. 2019లో రెడ్డి సామాజిక వర్గం టిడిపిని ద్వేషించింది. 2024 ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని కమ్మ సామాజిక వర్గం ద్వేషించింది. అయితే రాజకీయ పార్టీలకు సామాజిక వర్గాల మద్దతు మాట అటుంచితే.. శత్రువులుగా మారిపోవడం ఇటీవల పరిపాటిగా మారింది. అందుకే పార్టీలు ఇప్పుడు సామాజిక వర్గాల వ్యతిరేకి అనే ముద్ర పోగొట్టుకునేందుకు ఎక్కువ ప్రయత్నాలు చేస్తుంటాయి. ఇప్పుడు అదే ప్రయత్నంలో ఉన్నారు వైయస్సార్ కాంగ్రెస్ అధినేత జగన్మోహన్ రెడ్డి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా బలంగా పనిచేసింది కమ్మ సామాజిక వర్గం. ప్రపంచవ్యాప్తంగా వివిధ రంగాల్లో స్థిరపడిన కమ్మ సామాజిక వర్గం వ్యక్తులు ఏకతాటిపైకి వచ్చారు. తెలుగుదేశం పార్టీ గెలుపు కోసం విశేషంగా కృషి చేశారు. దీనికి కారణం లేకపోలేదు.

డీకే చాటింపు
తెలంగాణ దిన పత్రిక
మంగళవారం,నవంబర్,24, 2026

కనుమరుగవుతున్న
సంప్రదాయాలు..!

తెలంగాణ నేల ప్రకృతిని సాక్షాత్ పరబ్రహ్మ స్వరూపంగా దర్శించి, పూలనే దేవతలుగా కొలిచే అపురూప సాంస్కృతిక జీవన సౌందర్యం బతుకమ్మ పండుగ. స్త్రీత్వంలోని నైసర్గిక సృజనాత్మకతను, శ్రమజీవుల వేదనను, కుటుంబ అనుబంధాల మాధుర్యాన్ని, సమాజ సమష్టి చైతన్యాన్ని ఏకసూత్రంతో బంధించే అరుదైన సాంస్కృతిక మహోత్సవమిది. తీరొక్క పూలను గోపురంలా పేర్చి గౌరమ్మను కొలవడం, లయాత్మక చప్పట్ల తాళాల నడుమ గొంతు కలిపి బతుకు గాథలను ఆలపించడం, మాతృభూమి ఒడిలో ఆత్మీయతలను నెమరువేసుకోవడమే ఈ మహాపర్వపు మౌలిక అంతరార్థం. అయితే కాలగమనంలో చోటుచేసుకున్న పెనుమార్పులు, వినియోగ సంస్కృతి పెంచిన కృత్రిమ జాడ్యాలు, ఆడంబరాల వెనుక పరుగెత్తే యాంత్రిక జీవనం వల్ల ఈ వేడుకలోని సనాతన సంప్రదాయాలు క్రమంగా తెరమరుగవుతున్నాయి. దక్షిణ కాశీగా పేరొందిన జగిత్యాల జిల్లా చారిత్రక ధర్మపురి పుణ్యక్షేత్రం మొదలుకొని పల్లెలు, పట్టణాలు, నగరాల వరకు యావత్ తెలంగాణ సమాజంలో నేడు చోటుచేసుకుంటున్న మార్పులను నిశితంగా పరిశీలిస్తే, సాంస్కృతిక అస్తిత్వ పరిరక్షణ ఎంతటి పెను సవాలుగా మారిందో స్పష్టమవుతోంది. పండుగ బాహ్య వైభవంలో మార్పులు రావడం కాలక్రమంలో సహజ పరిణామమే అయినా, దాని జీవధార అయిన అంతరంగిక ఆత్మను, పర్యావరణ స్పృహను కోల్పోవడం సమాజ మనుగడకే తీరని నష్టం. శరదృతువు ఆరంభాన శరన్నవరాత్రుల వేళ, భాద్రపద బహుళ మహాలయ అమావాస్య నాటి 'ఎంగిలిపూల బతుకమ్మ'తో మొదలై ఆశ్వయుజ శుద్ధ దుర్గాష్టమి నాటి 'సద్దుల బతుకమ్మ' వరకు తొమ్మిది రోజుల పాటు సాగే ఈ ఉత్సవ శోభ వర్ణనాతీతం. ఉపాధి కోసం దూరతీరాలకు, మహానగరాలకు, గల్ఫ్ దేశాలకు వలసవెళ్లిన బిడ్డలంతా తమ మూలాలను వెతుక్కుంటూ సొంతగూటికి చేరే పవిత్ర వారధి ఈ పండుగ. అత్తవారింట్లో ఉన్న ఆడబిడ్డలు పుట్టింటికి చేరి, బాల్యస్మృతులను నెమరువేసుకుంటూ తోబుట్టువులతో గడిపే అపురూప వేళ ఇది. గతంలో ధర్మపురి గోదావరి పరివాహక ప్రాంతాలైనా, తెలంగాణలోని గ్రామీణ బీడు భూములైనా, చేల గట్లు, చెరువుల పరిసరాలు, గుట్టల వెంబడి పల్లెజనం స్వయంగా నడచి వెళ్లి పూలను సేకరించేవారు. "గునుగూ పూచే గుబురుల నిండా.. తంగేడు పూచే తరగల నిండా" అంటూ పాడుకుంటూ పసుపు వర్ణపు తంగేడు, తెల్లని గునుగు, కాట్లకుక్క, గుమ్మడి, రుద్రాక్ష, సీతమ్మజడలు, కట్లపూలు, బంతి, చేమంతులను కోసుకొచ్చేవారు. ఈ పూల సేకరణ కేవలం ఒక ఆచారం కాదు; అది తరతరాలుగా కొనసాగిన నిగూఢ ప్రకృతి పాఠశాల. ఏ పువ్వుకు ఎలాంటి ఔషధ గుణముందో, తంగేడులోని క్రిమినాశక శక్తి ఏమిటో, గుమ్మడి పువ్వుతో గౌరమ్మను ఎందుకు అర్చించాలో పెద్దలు చెబుతుంటే పిల్లలు ఆ జీవవైవిధ్య విజ్ఞానాన్ని సహజంగానే ఒంటబట్టించుకునేవారు. మోదుగాకులు, ఇస్తరాకులు, ఇత్తడి తాంబాలాలపై గుండ్రటి వలయాలుగా, ప్రకృతి వర్ణమాలలా పూలను వరుసలవారీగా శిఖరంలా అమర్చడంలో మహిళల విశిష్ట జ్యామితీయ కళా నైపుణ్యం ప్రతిఫలించేది. ఈ తొమ్మిది రోజుల మహోత్సవంలో రోజుకొక విశిష్ట నైవేద్య సమర్పణ పవిత్ర ఆచారంగా నిలిచింది. ఎంగిలిపూల బతుకమ్మ నాడు నువ్వులు, బియ్యప్పిండి మొదలుకొని అటుకుల బతుకమ్మ, ముద్దపప్పు బతుకమ్మ, నానే బియ్యం బతుకమ్మ, అట్ల బతుకమ్మ, అలిగిన బతుకమ్మ, వేపకాయల బతుకమ్మ, వెన్నముద్దల బతుకమ్మల మీదుగా సాగి చివరి రోజైన సద్దుల బతుకమ్మ నాడు పెరుగన్నం, చింతపండు పులిహోర, నిమ్మకాయన్నం, నువ్వుల సద్ది, కొబ్బరి సద్ది వంటి పంచభక్ష్యాల తయారీలో ఇంటిల్లిపాది నిమగ్నమయ్యేవారు. ఈ పిండివంటలు కేవలం నోరూరించే తినుబండారాలు కావు; వర్షాకాలం ముగిసి శీతాకాలం మొదలయ్యే సంధి కాలంలో వాతావరణ మార్పుల వల్ల సంక్రమించే రుగ్మతలను హరించే అద్భుత ఆయుర్వేద పోషకాహారాలు. ఇరుగుపొరుగుతో ఈ సద్దులను పంచుకోవడం వల్ల సమాజంలో హెచ్చుతగ్గులు సమసిపోయి, సమష్టి జీవన సౌభాగ్యం వెల్లివిరిసేది. సాయంసంధ్యా వేళల్లో పట్టువస్త్రాలు, పరికిణీలు ధరించిన మహిళలు, ముత్తైదువలు, ఆడపడుచులు నెత్తిమీద బతుకమ్మలను మోస్తూ చెరువు కట్టలు, ఊరి రచ్చబండలు, గోదావరి వంటి పుణ్యనదీ తీరాలకు బారులుతీరి వెళ్లే దృశ్యం కనులవిందు చేసేది ఆ జానపద గేయాల్లో రామాయణ, భారతాల పౌరాణిక ఘట్టాలతో పాటు, అత్తాకోడళ్ల అలకలు, పుట్టింటి తీపి జ్ఞాపకాలు, శ్రామిక స్త్రీల కష్టసుఖాలు, తెలంగాణ ప్రజా జీవన తాత్వికత ప్రతిధ్వనించేవి. రాతకోతల్లో భద్రపరచని ఈ అమూల్యమైన మౌఖిక సాహిత్యం తరం నుంచి తరానికి అలవోకగా సంక్రమించేది. పూజల అనంతరం మహిళలు పసుపు గౌరమ్మను భక్తితో నుదుట దిద్దుకుని, బతుకమ్మలను నిదానంగా జలాల్లో నిమజ్జనం చేసేవారు.



ఇందిరమ్మ జీవిత బీమాతో
ప్రతి కుటుం బానికి రూ.5 లక్షల ఆర్థిక భరోసా

ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి



నిజామాబాద్ ప్రతినిధి, నవంబర్ 23 (డీకే చాటింపు): అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి 5లక్షల ఆర్థిక భరోసా కల్పించా లనే సదాశయంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ష్టాత్మకంగా ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అమలు చేస్తోందని రాష్ట్ర ప్రభు త్వ సలహాదారు పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి అన్నారు. డిచ్‌పల్లి మండలం రాంపూర్ గ్రామంలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంపై ప్రజలకు అవగాహన కల్పించేం దుకు సదస్సు నిర్వ హించారు. సదస్సుకు ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేయగా, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్. భూపతి రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి తది తరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభు త్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి మాట్లా డుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయక త్వంలోరాష్ట్రప్రభుత్వం కులమతాలకు, రాజకీ యాలకు అతీతంగా ప్రజలందరినీ కలుపు కొని ముందుకు సాగు తోందన్నారు. సంక్షేమ పథకాల అమలులో మహిళలకు తొలి ప్రాధాన్యత ఇస్తూ, మహిళల పేరిట అనేక పథకాలను అమలు చేస్తున్నామని తెలి పారు.ఆర్థికంగా వెనుక బడిన, నిస్సహాయ స్థితిలో ఉన్న కుటుంబా లకు చేయూత పించన్ల ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తోం దన్నారు.ప్రమాదవశాత్తు కుటుంబ పోషణ చేస్తున్న వ్యక్తి మరణిం చినప్పుడు ఆ కుటుం బం ఆర్థికంగా ఇబ్బందు లు పడకుండా రూ.5 లక్షల బీమా అందించా లనే లక్ష్యంతో ఇందిర మ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రభుత్వం అమలులోకి తెచ్చిందని అన్నారు. మహిళలు స్వయం సమృద్ధి సాధించి ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరి స్తోందని, ఇందులో భాగంగా నిజామాబాద్ జిల్లాలో మహిళా సంఘాలకు రూ.1,100 కోట్లు ఆర్థిక సహాయం అందించడం జరిగిం దన్నారు. మహిళా సాధికారతే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

విమర్శించారు.మంచిప్ప రిజర్వాయర్ ద్వారా రాంపూర్ గ్రామానికి సైతం సాగు నీరు అందించేలా ప్రభుత్వం తరపున అన్ని ప్రయత్నాలు చేస్తామని హామీ ఇచ్చారు.ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డు ద్వారా సన్నబియ్యం అందిస్తు న్నామని, ఈ నెల 26వ తేదీ నుంచి మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్ర మానికి శ్రీకారం చుట్ట నున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయిలో నాణ్యమైన విద్యను అందించేందుకు ఉ పా ధ్యాయులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు.ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో నీటి వనరులను జాగ్రత్తగా వినియోగిం చుకోవాలని ప్రజలకు సూచించారు. తాగునీ టికి మొదటి ప్రాధాన్య తనిస్తూ, ఆ తర్వాతే సాగునీటికి ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని వెల్లడించారు. ఎమ్మెల్యే భూపతి రెడ్డి మాట్లాడుతూ,గతంలో కేవలం రైతులకు మాత్ర మే పరిమితమైన బీమా సౌకర్యాన్ని ఇప్పుడు ప్రతి పేద కుటుంబానికి విస్తరిం చాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ఇంది రమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్నితీసుకొ చ్చిందన్నారు. అనేక కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసింద న్నారు. అదేవిధంగా నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో కొత్తగా 3,500 మందికి పైగా లబ్ధిదారులకు చేయూత పెన్షన్లు అందిస్తున్నామని తెలిపారు. సంవత్స రానికి రూ. 20 వేల కోట్ల రుణాల పరిమితి ఉన్నప్పటికీ, మూడేళ్ల లోనే ఆ పరిమితికి మించి రూ. 79 వేల కోట్ల రుణాలను మహిళా సంఘాలకు అందించడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శన మన్నారు. పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నా మని, రానున్న రోజుల్లో భూమిలేని నిరుపే దలకు సైతం ఇంటి స్థలం కేటాయించి ఇళ్లు నిర్మించి ఇచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని స్పష్టం చేశారు. రైతులు ఎవరూ రూ.3 వేల కంటే తక్కువ ధరకు ధాన్యాన్ని విక్రయిం చవద్దని, ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని భరోసా కల్పించారు. రాంపూర్ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని హామీఇచ్చిన ఎమ్మెల్యే, రానున్న రోజుల్లో మంచిప్ప ప్రాజెక్టు ద్వారా గ్రామానికి కూడా సాగునీరు అందించేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తామని తెలిపారు. ఆహార భద్రత కార్డు కలిగిన ప్రతి కుటుంబా నికి ఇందిరమ్మ కుటుం బ జీవిత బీమా పథకం వర్తిస్తుందని, 18 నుండి 59 సంవత్సరాల వయ సు కలిగినవారు బీమా సదుపాయం కోసం వివరాలు నమోదు చేసుకోవచ్చని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. జిల్లా లోని అన్ని మున్సిపల్ కార్యాలయాలు, మండల కేంద్రాల్లోని గ్రామ పంచాయతీలలో జీవిత బీమా వివరాల నమోదు కోసం ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తామని,అర్హత కలిగిన వారు ఎక్కడి నుంచి అయినా వివరా లను నమోదు చేసుకు నే వెసులుబాటు ఉందని వెల్లడించారు. డిసెంబర్ 20వ తేదీ వరకు వివరాల నమోదుకు అవకాశం కల్పించారని, దీనిని దృష్టిలో పెట్టుకొని కొత్తగా రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి అర్హత ఉంటే డిసెంబర్ 10వ తేదీ లోపు రేషన్ కార్డులు మంజూరు చేయాలని, తద్వారా వారు కూడా బీమా పథకం ద్వారా లబ్ధి పొందుతారని అధికా రులకు సూచించారు. ఆహార భద్రత కార్డు నెంబర్ ఆధారంగా ఆన్ లైన్లో వివరాలు నమో దు చేసిన మీదట బీమా చేసుకున్న వ్యక్తి మొబైల్ ఫోన్ కు సమా చారం వస్తుందని అన్నారు. నామినీల వివరాలు తెలుపాల్సి ఉన్నందున బీమా చేసుకునే వ్యక్తి నమోదు శిబిరానికి తప్పనిసరి హాజరై వివరాలు అందించాల్సి ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు. అయితే నామినీలు రావాల్సిన అవసరం లేదని అన్నా రు. భూ వివాదాలను శాశ్వతంగా పరిష్కరిం చాలని ధ్యేయంతో ప్రభుత్వం ప్రతిష్టా త్మకంగా నిర్వహిస్తున్న భూముల రీసర్వే ప్రక్రియకు సహకరిం చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహిర్ బిన్ హందాన్, రాష్ట్ర గీత పారిశ్రామిక సహకార కార్పొరేషన్ చైర్మన్ శేఖర్ గౌడ్, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, ఐ డీ సీ ఎం ఎస్ మాజీ చైర్మన్ తారాచంద్ నాయక్, జెడ్పీ సీఈఓ సాయా గౌడ్,డీఆర్డీఓ సాయన్న, డీపీఓ నాగరాజు, సర్పంచ్ రమ్య,వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, మహిళ లు,గ్రామస్థులు పాల్గొన్నారు.

బిఎస్ఎన్ఎల్ రాష్ట్ర మూడవ మహాసభలు విజయవంతం
అఖిలభారత జనరల్ సెక్రెటరీ మురళీధరన్ నాయర్



నిజామాబాద్ ప్రతినిధి నవంబర్ 23 (డీకే చాటింపు): హైదరాబాదులోని ఆస్మాన్ మహల్ లో ఆల్ ఇండియా బిఎస్ ఎన్ఎల్ అండ్ డాట్ పెన్షనర్స్ అసోసి యేషన్ తెలంగాణ రాష్ట్ర మూడవ మహా సభలు విజయవంతం గా జరిగాయిఅని ఈ.వి.ఎల్ నారాయణ వివరించారు.ఈ మహా సభలకు అఖిలభారత జనరల్ సెక్రెటరీ మురళీ ధరన్ నాయర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మహాసభ ను ఉద్దేశించి మాట్లాడుతూ,ముఖ్యంగా బిఎస్ఎన్ఎల్ ఉద్యోగుల, అధికారుల మూడవ వేతన సవరణ ఆలస్యం అవుతున్న దానిపై, సర్వీస్ రంగంలో ఉన్న దీంచీ ను లాభ నష్టాలతో ముడి పెట్టడం సరికాదని, కనుక అబద్ధబులిటీ క్లాజు ను వెంటనే తొలగించి మూడో వేదన సవరణలు వెంటనే జరపాలని డిమాండ్ చేశారు. దీనివల్ల పెన్షనర్ల కు పెన్షన్ రివిజన్ కూడా ఆలస్యం అయిపోయిం దని ఇది చాలా అన్యా యమని,కేంద్ర ప్రభు త్వం కావాలని పెన్ష నర్లపై కక్ష గట్టి రావలసిన సదుపా యాలను ఒక్కొక్కటిగా తొలగిస్తూ వస్తున్నదని కరోనా సమయంలో రైల్వే మరియు ఆర్టీసీ బస్సులలో 40% రాయితీలను రద్దు చేసిందని అలాగే మెడికల్ బిల్లులు మరియు మెడికల్ అలవెన్స్ లను ఇవ్వటం నిలిపివే సిందని దీనివల్ల పెన్ష నర్లు అనేక ఇబ్బందు లు పడుతున్నారని, దీని కొరకు పెన్షనర్లు అందరూ ఏకమై ఐక్య పోరాటాలు నిర్వహిం చాలని మన పెన్షనర్ల యొక్క హక్కులను కాపాడుకోవాలని పిలుపు నిచ్చారు. రాష్ట్ర కార్యదర్శి రామచంద్రుడు, ఆల్ ఇండియా అసిస్టెంట్ జనరల్ సెక్రెటరీ తిరుమల చారి, బిఎస్ ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శిజి సాంబశి వరావు,బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూని యన్ ఆల్ ఇండియా అసిస్టెంట్ జనరల్ సెక్రెటరీ మరియు రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ సంపత్ రావు పాల్గొన్నారు.

ఈ మహాసభలకు నిజామాబాద్ జిల్లా నుండి 16 మంది ప్రతినిధులు హాజరై నారు. మహాసభలలో ఈ సందర్భంగా రాష్ట్ర కమిటీ ఎన్నికలు జరిపారు.రానున్న రెండు సంవత్సరాలకు రాష్ట్ర అధ్యక్షులుగా బిఆర్ వీరాస్వామి మరియు కార్యదర్శిగా రామచంద్రుడు ఎన్నిక కావడం జరిగింది. ఈ ఎన్నికలలో నిజామాబాద్ జిల్లా నుండి చందుపట్ల మధుసూదన్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా మరియు డి బాల స్వామి రాష్ట్ర నిర్మాణ కార్యదర్శిగా ఎన్నిక కావడం జరిగింది.

కరీంనగర్ లో చేపట్టిన మహా పాద యాత్ర లో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర సీనియర్ నేత రాష్ట్ర కో ఆపరేటివ్ సెల్ కన్వీనర్ కోలన్ శంకర్ రెడ్డి ,



హైదరాబాద్, (డికే చాటింపు) కేంద్ర హోమ్ శాఖ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యం లో చేపట్టిన సర్ ఎస్ ఐ ఆర్ పై కాంగ్రెస్ తప్పుడు ఆరోపణలకు వ్యతిరేకంగా కరీంనగర్ లో చేపట్టిన మహా పాద యాత్ర లో బీజేపీ రాష్ట్ర సీనియర్ నేత రాష్ట్ర కో ఆపరేటివ్ సెల్ కన్వీనర్ కోలన్ శంకర్ రెడ్డి , చేకూర కృష్ణ రెడ్డి, సత్యనారాయణ, గోపాల్ కూర్మ, సదానంద్ జయ కుమార్ తదితరులు పాల్గొన్నారు పాల్గొని సంఘీ భావం తెలిపినాము ఈ సందర్భంగా శ్రేణులతో కలిసి పాల్గొనడం జరిగినది బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ దేశ ద్రోహులతో చేతులు కలిపి దేశ రాజ్యాంగం పై , దేశ ప్రజాస్వామ్యం పై తప్పుడు ప్రచారాన్ని బీజేపీ కార్య కర్తలు తెగించి కోట్లాడి దేశాన్ని రక్షించుకోవాలని అన్నారు , కాంగ్రెస్ పని అయిపోయింది అన్నారు

ఈనెల 28న ఆల్ ఇండియా బ్రాహ్మణ ఫెడరేషన్ సమావేశం



హైదరాబాద్, (డికే చాటింపు) ఆల్ ఇండియా బ్రాహ్మణ ఫెడరేషన్ జాతీయ కేంద్ర కార్యవర్గ సమావేశం ఈనెల 28వ తేదీన సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరుగుతుందని ఫెడరేషన్ సెక్రటరీ జనరల్ ద్రోణం రాజు రవికుమార్ జాతీయ ఉపాధ్యక్షులు తెలంగాణ ఇన్చార్జి నైషధం సత్యనారాయణమూర్తి లు మాట్లాడుతూ తెలిపారు. సోమవారం నాడు వారు విలేకరుల సమావేశంలో వారు ప్రసంగిస్తూ ఈనెల 28వ తేదీన సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే ఈ కార్యక్రమం లో బ్రాహ్మణులు ఎదుర్కొంటున్నట్టి సమస్యల మీద జాతీయస్థాయిలో బ్రాహ్మణ ఆర్థిక కార్పొరేషన్ ఏర్పాటు, బ్రాహ్మణులకు రాజకీయ, సామాజిక రంగాలలో, గుర్తింపు తదితర అంశాల మీద సుదీర్ఘ చర్చ జరుపుతారని వారు తెలిపారు. జాతీయ కార్యదర్శి వక్కలంక శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ సమావేశానికి కేంద్ర కమిటీ సభ్యులందరూ హాజరు అవుతారని అదేవిధంగా ముఖ్య అతిథిగా రాష్ట్ర మంత్రివర్యులు రంగారెడ్డి జిల్లా ఇన్చార్జి దుద్దిల్ల శ్రీధర్ బాబు మాజీ కేంద్రమంత్రి సముద్రాల వేణుగోపాలచార్యులు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షులు నారపరాజు రామచందర్రావు మాజీ ఐఏఎస్ అధికారి కె.వి.రమణాచారి జస్టిస్ బుల్స్ శివశంకర్ ఎమ్మెల్సీలు గిడుగు రుద్రరాజు వాణి దేవి తదితరుల బ్రాహ్మణ నాయకులు పాల్గొంటున్నారని తెలిపారు ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని బ్రాహ్మణ సమాజం ఎదుర్కొంటున్న సమస్యలపై సుదీర్ఘ చర్చ ఈ సమావేశంలో జరుగుతుందని తెలిపారు ఇంకా సమావేశంలో జాతీయ కార్యదర్శివక్కలంక శ్రీనివాసరావు చింతపల్లి మంగపతి రావు, వారణాసి వంశీ తదితర నాయకులు పాల్గొన్నారు.

జర్నలిస్టు వెంకటరమణ మృతి-టీడబ్ల్యూజేఎఫ్ సంతాపం



డీకే చాటింపు,(హైదరాబాద్): నగరంలోని అంబర్ పేటలో గుండెపోటుతో హఠాన్మరణం చెందిన జర్నలిస్టు వనం వెంకటరమణ మృతి చెందారు. ఆయన భౌతిక కాయానికి తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య వెంకటరమణ ఇంటికి వెళ్ళి ఆయన భౌతిక కాయం పై పూలమాల ఉంచి ఘనంగా నివాళు లర్పించారు. ఆయనతో పాటు ఫెడరేషన్ జాతీయ కౌన్సిల్ సభ్యుడు కుంచం శ్రీనివాస్, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి. రవికుమార్, ఫెడరేషన్ నాయకులు సతీష్ ముదిరాజ్, వర్కాల కిష్టయ్య, యాదయ్య తదితరులు కూడా వెంకటరమణ భౌతిక కాయంపై పూలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మామిడి సోమయ్య వెంకటరమణ కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. పదేళ్ళుగా జర్నలిజం వృత్తిలో కొనసాగిన వెంకటరమణ చిన్న వయసులోనే గుండెపోటుకు గురై చనిపోవడం అత్యంత బాధాకరమని అన్నారు. జర్నలిజం వృత్తిని నమ్ముకొని, నీతి నిజాయితీతో పని చేశారని, జర్నలిజంలో ఎదుగుతున్న తరుణంలో ఇలా జరగడం విచారకరమని మామిడి సోమయ్య పేర్కొన్నారు. పలు టీవీ చానళ్ళు,పత్రికల్లో రిపోర్టర్ గా నిబద్ధతతో పని చేసిన వెంకటమరణ ఇటీవల తెలుగు ప్రభ పత్రికలో రిపోర్టర్ గా చేరి తన వృత్తిని అంకితభావంతో కొనసాగించారని అన్నారు. అత్యంత పేదరికంలో ఉన్న వెంకటరమణ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మామిడి సోమయ్య కోరారు. వెంకటరమణ లాంటి ఎంతోమంది జర్నలిస్టులు ఏళ్ళతరబడి జర్నలిస్టుగా పనిచేసి చివరికి పేదరికంతో, అనారోగ్యంతో చనిపోతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. జర్నలిస్టులకు ప్రభుత్వం కనీసం ఉచిత వైద్యం, పింఛన్ వంటి సదుపాయాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.


హ్యూమన్ ట్రాఫికింగ్‌పై ప్రజల్లో అవగాహన
సోషలో మీడియా ద్వారా యువత టార్గెట్
మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ


విజయవాడ: ఆంధ్రప్రదేశ్‌లో మనుషుల అక్రమ రవాణా పై అవగా హన పెంచేందుకు ఏపీ మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ కీలక కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో శైలజ నేతృత్వంలో రైల్వే పోలీసులతో కలిసి విజయవాడలో శుక్రవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించడం ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. ఈ కార్యక్రమం ద్వారా ట్రాఫికింగ్‌పై ప్రజల్లో అవగాహన పెంపుతో పాటు, గుర్తింపు విధానాలపై కూడా వివరణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైల్వే డివిజనల్ అధికారులతో కలిసి పనిచేస్తున్నామని, ముఖ్యంగా యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ అంశంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు రాయపాటి శైలజ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తమిళనాడుకు చెందిన పీఎం నాయక్ హాజరయ్యారని పేర్కొన్నారు. ట్రాఫికింగ్ అంటే.. ఒకే రకమైన నేరం కాదని, ఇది అనేక రూపాల్లో జరుగుతుందని రాయపాటి శైలజ వ్యాఖ్యానించారు. విద్యార్థులను విదేశాలకు పంపిస్తామని చెప్పి మోసం చేస్తున్నారని తెలిపారు. పలు మార్గాల్లో ట్రాఫికింగ్ జరుగుతుంతోందని వెల్లడించారు. ముఖ్యంగా, బాధితులను గుర్తించడం అత్యంత కీలకమని స్పష్టం చేశారు. ప్రస్తుతం ట్రాఫికింగ్ మాఫియా తమ విధానాలను మార్చుకుంటున్నాయని, సోషల్ మీడియా ద్వారా కూడా యువతను టార్గెట్ చేస్తున్నాయని తెలిపారు. ముఖ్యంగా బీటెక్ చదువుతున్న విద్యార్థులను విదేశాలకు తీసుకెళ్లి, వారిని సైబర్ నేరాల్లో పాల్గొనేలా చేస్తున్నారన్నారు. ఇది సాధారణంగా కనిపించని కొత్త రకం ట్రాఫికింగ్ అని, దీనిపై ప్రత్యేక అవగాహన అవసరమని తెలిపారు. ట్రాఫికింగ్ బాధితులను గుర్తించడం మాత్రమే కాకుండా, వారిని సైకలాజికల్‌గా ఎలా డీల్ చేయాలో కూడా ఈ కార్యక్రమంలో వివరించామని రాయపాటి శైలజ పేర్కొన్నారు. బాధితులు మానసికంగా చాలా ఒత్తిడిలో ఉంటారని, అందుకే వారికి సహాయం చేయాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులను గుర్తించేందుకు టెక్నాలజీని కూడా ఉపయోగిస్తున్నట్లు వెల్లడించారు. ముఖ్యంగా విశాఖపట్నంలో రోబోటిక్ సిస్టమ్ ద్వారా అనుమానాస్పద వ్యక్తులను గుర్తించే ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. ఇది భవిష్యత్తులో ట్రాఫికింగ్‌ను అరికట్టడంలో కీలక పాత్ర పోషించవచ్చని అభిప్రాయపడ్డారు.


ఒకరు చెప్తే సమస్య కాదు..పదిమంది చెబితేనే సమస్య..!?

-నాలుగు రోజుల నుంచి నెలకొన్న నీటి సమస్య... -కార్యదర్శి పట్టించుకోరు..! పాలకవర్గం స్పందించాదు..? -క్షేత్రస్థాయిలో కానరాని కార్యదర్శి... -పంచాయతీ కార్యాలయానికి పరిమితమవుతున్న కార్యదర్శి... -ఆయన పనితీరుపై పట్టించుకోని పాలకవర్గం... -మూడోవ వార్డులో సక్రంగా జరగని మిషన్ భగీరథ నీటి సరఫరా... -సమస్యను అధికారి దృష్టికి తీసుకెళ్లిన వార్డు సభ్యునికి ఉచిత సలహా ఇచ్చిన సదరు అధికారి...!? -అధికారి,పాలకవర్గం పనితీరుకు నిదర్శనం మూడో వార్డు నీటి సరఫరా... -జిల్లా కలెక్టర్ నివసించే పంచాయతీ పరిధిలోనే ఈ వ్యవహారం... -ఇదండీ సింగారం గ్రామపంచాయతీ పనితీరు... -నారాయణపేట మండలం సింగారంలో మిషన్ భగీరథ నీటి సరఫరాపై "డీకే చాటింపు" ప్రత్యేక కథనం..









నారాయణపేట,(డీకే చాటింపు): ఒకరు చెప్తే సమస్య కాదు..!పదిమంది చెబితేనే సమస్య..!? ఏంటి అందరు కలిసి చెప్తేనే సమస్యను అధికారులు,పాలకవర్గం వింటారా ఏంటి..అని ఎవరికైనా అనుమానం రాకపోవచ్చు..!అవును మీరు అనుకున్నది నిజమే. ఈ సమస్య ఏ మారుమూల గ్రామ పంచాయతీలో కాదు సుమా..!జిల్లా పాలన అధికారి నివసించే గ్రామ పంచాయతీలో ఓ అధికారి పనితీరు వ్యవహారంపై సర్వత్ర చర్చ జరుగుతుంది..!?

సింగారం గ్రామపంచాయతీలో...

తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ రక్షిత మంచినీటిని అందించాలనే ఉద్దేశ్యంతో గత సీఎం కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన మిషన్ భగీరథ పథకం ప్రజలకు వరంగా మారింది.అయితే అధికారుల పర్యవేక్షణ లోపమా..? లేక ఇతరత్రా కారణాలు..!? తెలియదు కానీ నారాయణపేట మండలం సింగారం గ్రామ పంచాయతీలో మిషన్ భగీరథ తాగునీరు సరఫరా సవ్యంగా జరగకపోవడంతో ప్రజలు గ్రామపంచాయతీ పాలకవర్గం,అధికారుల తీరుపై మండిపడుతున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని,పైగా దురుసుగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గ్రామంలోని శివాలయం ప్రాంతం నుంచి గ్రామ పంచాయతీ కార్యాలయం వరకు సక్రంగా నీటి సరఫరా జరగడంలేదని మొదటి నుంచి ఫిర్యాదులు ఉన్నాయి.ఈ మేరకే ఆ ఏరియా వారు గ్రామసభలో, గ్రామ సర్పంచ్,మూడోవ వార్డు సభ్యునికి ఆ ప్రాంతం వారు స్వయంగా విన్నవించుకుంటూ వస్తుంటే ఈ సమస్య నేటికీ ఓ కొలిక్కి రాకపోవడం వారి పనితీరుకు నిదర్శనగా చెప్పుకోవచ్చు. సర్పంచ్ ను,మూడోవ వార్డు సభ్యుని అడిగిన తర్వాత ఆ మరుసటి రోజు నుంచి కొన్ని రోజులపాటు నీటి సరఫరా సక్రంగా జరగడం ఆ తర్వాత యథాస్థితికి చేరుకోవడం షరామామూలే..!?ఈ విషయంపై మూడోవ వార్డు సభ్యులు భాను ప్రకాష్ మాటలు వింటుంటే ఇంతకు ఈ ప్రజా ప్రతినిధులు గ్రామ ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ఎన్నికయ్యారా..!లేక హోదా కోసం ఎన్నికయ్యారా ..!?అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.గ్రామ పంచాయతీ కార్యాలయం పరిధిలోని కొన్ని నివాసాలకు పది రోజుల క్రితం నీటి సమస్య నెలకొని ఉందని ఆ ఏరియా వారు వార్డు సభ్యునికి సమాచారం ఇస్తే.. కార్యదర్శి ఉదయం ఏడు గంటలకు వచ్చి పరిశీలిస్తామని హామీ ఇచ్చారు .ఆ తర్వాత వారు రాకపోవడంతో మరోమారు వార్డు సభ్యుని దృష్టికి తీసుకురాగా సీఎం సభకు వెళ్లి అలసిపోయారు. తర్వాత వస్తారని చెప్పారు.ఈ కథ అక్కడితో ముగిసింది. తాజాగా ఈనెల 20 నుంచి 23 వరకు నాలుగు రోజులపాటు నీటి సరఫరా సక్రంగా లేదు.శని,ఆదివారం మళ్లీ వార్డు సభ్యునికి దృష్టికి ఓ ఇంటి వారు తీసుకురాగా నేను పంచాయతీ కార్యదర్శికి చెప్పాను.ఆయన ఏవేవో విషయాలు చెప్పారు..అవి పాటించాలని ఉచిత సలహా ఇచ్చారు.వార్డు సభ్యుడు, కార్యదర్శి మాట్లాడుకొన్న ఉచిత సలహాలను నీటి సమస్య విన్నవించుకున్న సదరు వ్యక్తికి వార్డు సభ్యులు చెప్పుకొచ్చారు.ఒక నమన్య వచ్చినప్పుడు పంచాయతీ కార్యదర్శి,పాలకవర్గం క్షేత్రస్థాయిలో పర్యటించి ఆ సమస్యపై నిగ్గు తేల్చాలి.కానీ వారు క్షేత్రస్థాయిలో పర్యటించకుండానే ఉచిత సలహాలను సమస్యను ఏకరువు పెట్టిన వారికి వివరించిన తీరును పరిశీలిస్తే..ఇంతకు ఈ పాలకవర్గం,సదరు అధికారి పనితీరుకు ఈ నీటి సమస్య ఓ నిదర్శనంగా చెప్పవచ్చు. కడివేడి నీటి కోసం ఎన్నో ఇబ్బందులకు గురవుతున్న కొన్ని నివాసల వారు రోజు పడుతున్న కష్టాలు..కన్నీరు వారికి ఏం తెలుసు..! ఆఫీసుకు పరిమితం కార్యదర్శి పంచాయతీ కార్యదర్శి గ్రామానికి వచ్చి ఆఫీసుకే పరిమితమై వెళ్లిపోతారే తప్ప వీధిలో ఉండే సమస్యలు ఆయనకు పట్టడం లేదని గ్రామ ప్రజలు మండిపడుతున్నారు.ఈ విషయంపై పాలకవర్గం కూడా స్పందించకపోవడం విశేషం. ఈ అంశాన్ని పరిశీలిస్తే సదరు అధికారిని ఈ పాలకవర్గం వెనకేసుకొస్తున్నట్లు స్పష్టం అవుతుంది.గతంలో పనిచేసిన కార్యదర్శి రాకేష్ సమర్థవంతంగా విధులు నిర్వహించి గ్రామ ప్రజలచే ప్రశంసలు పొందారు.ఇదే విషయాన్ని గ్రామ సభలో ప్రజలు ప్రస్తావిస్తే ప్రస్తుత అధికారి..ఆయననే తెచ్చుకోండి..నేనెందుకు అని ఖరాఖండిగా మాట్లాడిన తీరు ఆయన విధి నిర్వహణకు నిదర్శనంగా చెప్పవచ్చు.

DK SARADHYAM LOOD CHAATIMPU
వాయిస్

ఫిర్యాదులు వచ్చిన పట్టింపు ఏది..!?

మిషన్ భగీరథ తాగునీటి సరఫరాపై పలు మార్లు ఫిర్యాదు చేసిన పట్టింపులు కరువయ్యాయి.సంబంధిత అధికారి గ్రామంలో ఏనాడు పర్యవేక్షణ చేసిన దాఖలాలు లేవని ప్రజలు వాపోయారు. వీరి నిర్లక్ష్యమే నీటి సరఫరా సక్రంగా జరగడంలేదని ఆరోపణలు ఉన్నాయి. పాలకవర్గం పట్టించుకోకపోవడంతో ఆడిందే ఆట..పాడిందే పాటగా తయారైంది ఆ అధికారి విధి నిర్వహణ..!?

మూడోవ వార్డు సభ్యుడు ఏమంటున్నారంటే...

మూడవ వార్డులో మిషన్ భగీరథ నీటి సరఫరాపై పంచాయతీ కార్యదర్శికి రెండు సార్లు చెప్పాను. అలాగే సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లాను.అందుకు వారిద్దరు ఏమన్నారు అంటే.. ఎన్ని ఇళ్లకు రావు..మన హాయంలోనే రావడం లేదా.. ఇదివరకు రావడం లేదా..!? నీటి సమస్యపై నీకు విన్నవించిన వారి ఇల్లు పైకి ఉంది.కింది భాగం నుంచి పైపు వేసుకోండి..ఒకరి కోసం మనం ట్రీట్మెంట్ చేయలేం కదా..!? ఈ విధంగా కొన్ని ఇల్లు ఉంటే పరిష్కారం చేస్తాం..ఒకరి కోసం ఏం పరిష్కారం చేస్తాం..అని పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్ చెప్పారు.అధికారి పట్టించుకోనప్పుడు మీ..

పాలకవర్గం ఏం చేస్తుందని వార్డు సభ్యునికి సదరు నీటి బాధితుడు ప్రశ్నించగా అందుకు పొంతన లేని సమాధానాలు ఇచ్చారు. కార్యదర్శికి నువ్వు ఉదయం పూట గ్రామానికి రా..చాలా సమస్యలు ఉన్నాయని నేను చెప్పాను.ఊరంతా తిరగవద్దు నా వార్డుకొచ్చి తిరుగు అని చెప్పాను. అయినా కార్యదర్శి పట్టించుకోవడం లేదు.వార్డు సమస్యను అధికారి చూడకపోవడం బాధాకరమని మూడోవ వార్డు సభ్యులు భాను ప్రకాష్ ఆవేదన వ్యక్తం చేశారు.

మేం ఏది చేసినా చెల్లుబాటు అవుతుంది..!?

ఈనెల 20 నుంచి 23 వరకు నాలుగు రోజులపాటు గ్రామంలోని శివాలయం ప్రాంతంలో నీటి సరఫరా సక్రంగా లేదు.ఇదే విషయాన్ని ఆదివారం ఉదయం నీటి సరఫరా చేసే వ్యక్తితో పాటు పారిశుద్ధ్య సిబ్బందికి సైతం ఆ ప్రాంతపువాసులు స్వయంగా చెప్పడం జరిగింది. సాయంత్రం పూట నీరు వదలమని చెప్పాను కానీ వినడం లేదు.అని ఒక్కరు.. సాయంత్రం వదులుతామని చెప్పిన సదరు నీటి సరఫరాదారునికి సాయంత్రం పూట ఆ ప్రాంత ప్రజలు ఫోన్ చేస్తే నేను హైదరాబాదులో ఉన్నాను అని చెప్పుకొచ్చారు.ఈ విషయాన్ని పరిశీలిస్తే మేం ఏది చెప్తే అది చెల్లుబాటు అవుతుందని చెప్పుకోవచ్చు. వారి పనితీరుకు ఈ సంఘటన అద్దం పడుతుంది. మండల అధికారులు స్పందించి సింగారంలో నీటి సమస్యను పరిష్కరించి విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సంబంధిత అధికారిపై తగు చర్యలు చేపట్టాలని ఆ గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

1,090 కోట్ల స్టీల్ బ్రిడ్జీలు, అండర్‌పాస్‌ల రద్దు



హైదరాబాద్, : హైదరాబాద్ కేబీఆర్ పార్కు చుట్టూ ఏడు కూడళ్లలో చేపట్టాలని భావించిన రూ.1,090 కోట్ల స్టీల్ బ్రిడ్జీలు, అండర్‌పాస్‌ల ప్రాజెక్టును జీహెచ్ఎంసీ రద్దు చేసింది. వన్‌వే విధానం అమలు చేసిన తర్వాత ట్రాఫిక్ సమస్య గణనీయంగా తగ్గడంతో భారీ వ్యయంతో నిర్మాణాలు చేపట్టడం అవసరం లేదని ప్రభుత్వం భావించింది. జూబ్లీ చెక్‌పోస్టు, కేబీఆర్ పార్కు గేట్, ముగ్ధా జంక్షన్, బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి తదితర ప్రాంతాల్లో పనులను నిలిపివేశారు. కాంట్రాక్టర్లు కేఎన్ఆర్, మేఘాతో చేసుకున్న ఒప్పందాలను కూడా రద్దు చేశారు. ఇదే సమయంలో పంజాగుట్ట నుంచి జూబ్లీ చెక్‌పోస్టు వరకు కొత్త ఎలివేటెడ్ కారిడార్‌కు మార్గం సుగమమైంది.హైదరాబాద్ నగరానికి కీలకమైన కేబీఆర్ పార్కు చుట్టూ ఏడు ప్రధాన కూడళ్లలో చేపట్టాలని ప్రతిపాదించిన స్టీల్ బ్రిడ్జీలు, అండర్‌పాస్‌ల నిర్మాణానికి బ్రేక్ పడింది. మొత్తం రూ.1,090 కోట్ల అంచనా వ్యయంతో రెండు ప్యాకేజీలుగా చేపట్టిన ఈ పనులను రద్దు చేయాలని జీహెచ్ఎంసీ నిర్ణయించింది. నిర్మాణ పనులు ప్రారంభిస్తే కొంతకాలం పాటు నగరంలోని ప్రధాన మార్గాల్లో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడే అవకాశం ఉండటంతో అధికారులు ప్రత్యామ్నాయంగా వన్‌వే విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చారు.నెల రోజుల క్రితం అమలు చేసిన వన్‌వే విధానంతో మొదట్లో వాహనదారులు కొంత ఇబ్బంది పడ్డారు. అయితే ఒకట్రెండు రోజుల తర్వాత పరిస్థితి క్రమంగా మెరుగుపడింది. మూడో రోజు నుంచి ప్రధాన సిగ్నళ్ల వద్ద ఎక్కువసేపు నిరీక్షించాల్సిన అవసరం లేకుండా వాహనాలు సాఫీగా కదలడం ప్రారంభించాయి. దీంతో కేబీఆర్ పార్కు చుట్టుపక్కల ట్రాఫిక్ సమస్యను భారీ నిర్మాణాలు చేపట్టకుండానే పరిష్కరించే అవకాశం ఉందని అధికారులు భావించారు.ట్రాఫిక్ రద్దీ మెరుగుపడిన నేపథ్యంలో వందల కోట్ల రూపాయలు వెచ్చించి స్టీల్ బ్రిడ్జీలు, అండర్‌పాస్‌లు నిర్మించడం అవసరం లేదని ప్రభుత్వం నిర్ణయించింది.పురపాలకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, జీహెచ్ఎంసీ ప్రత్యేక అధికారి జయేశ్‌రంజన్ అధ్యక్షతన సమావేశం జరిగింది. జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్ కూడా సమావేశంలో పాల్గొన్నారు.జూబ్లీ చెక్‌పోస్టు, కేబీఆర్ పార్కు గేట్, ముగ్ధా జంక్షన్, బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి పరిసరాలతో పాటు ఇతర కూడళ్లలో ప్రతిపాదించిన నిర్మాణాలను రద్దు చేయాలని నిర్ణయించారు. ఆయా పనుల కోసం కేఎన్ఆర్, మేఘా సంస్థలతో కుదుర్చుకున్న ఒప్పందాలను రద్దు చేసేందుకు కూడా స్థాయీ సంఘం ఆమోదం తెలిపింది. దీంతో కేబీఆర్ పార్కు చుట్టూ భారీ నిర్మాణాలతో ట్రాఫిక్ నిర్వహణకు సంబంధించిన పాత ప్రణాళికకు తెరపడింది.

రూ. 80కి చేరిన సన్నబియ్యం



నల్గొండ: సన్న బియ్యం ధరలు సామాన్యుడికి చుక్కలు చూపిస్తున్నాయి. కేవలం నాలుగు నెలల వ్యవధిలోనే కిలో సన్న బియ్యం ధర ఏకంగా 25% మేర పెరిగింది. గతంలో కిలో రూ.50 నుంచి రూ.55 మధ్య ఉన్న ధరలు, ఇప్పుడు రూ.65 నుంచి రూ.83 వరకు చేరాయి. లో క్వాలిటీ సన్నరకం బియ్యం సైతం రూ.60కి పైగా ధర పలుకుతున్నాయి. ఎల్‌నినో ఎఫెక్ట్, వర్షాలు లేక ధాన్యం దిగుబడి తగ్గడం, యాసంగి సాగు విస్తీర్ణం తగ్గడంతో ధరల పెరుగుదలకు ప్రధాన కారణాలుగా తెలుస్తోంది. తెలంగాణలో పండుతున్న సన్నరకం ధాన్యానికి కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌లో భారీ డిమాండ్ ఉంది. కోతలు మొదలవ్వగానే ఆయా రాష్ట్రాల వ్యాపారులు పచ్చి ధాన్యాన్ని కొనుగోలు చేసి ముంబై, బెంగళూరు, చెన్నై నగరాలకు తరలిస్తుండటంతో స్థానికంగా కొరత ఏర్పడుతుంది. గతంలో మిల్లర్లు వ్యాపారులకు గడువు ఇచ్చేవారు. ప్రస్తుతం నగదు చెల్లించిన తర్వాతే బియ్యం ఇస్తుండటంతో రిటైల్ షాపుల యజమానులు ధరలు భారీగా పెంచుతున్నారు. పౌరసరఫరాల సంస్థ గత ఖరీఫ్‌లో సేకరించిన ధాన్యంలో మిగులు, కస్టమ్ మిల్లింగ్ రైస్‌లో అక్రమాలు జరగడం మార్కెట్‌ను దెబ్బతీస్తున్నాయి. విజిలెన్స్ తనిఖీల్లో రూ.2,000 కోట్ల విలువైన ధాన్యం మాయమైనట్లు తేలింది.కొందరు మిల్లర్లు ప్రభుత్వ మేలు రకం ధాన్యాన్ని ఇతర రాష్ట్రాలకు విక్రయించి, నాణ్యత లేని ధాన్యాన్ని, రేషన్ బియ్యాన్ని అక్రమంగా మిల్లులకు తరలించి ధరల పెరుగుదలకు పరోక్ష కారణమవుతున్నాయి.

బియ్యం ధరలు (25 కిలోలు) లలిత సోనామసూరి:
కిలో రూ.71.33 కర్నూలు సోనామసూరి: కిలో రూ.70 హెచ్ఎంటీ రా రైస్: కిలో రూ.69 –రూ.78 పొరుగు రాష్ట్రాల వ్యాపారులు సన్నధాన్యం సేకరించకుండా ప్రభుత్వం కఠిన ఆంక్షలు విధించాలి. బియ్యం అక్రమ నిల్వలు, మిల్లుల్లో రీసైక్లింగ్‌పై విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టాలి. ధాన్యం కేటాయింపుల సమయంలో మిల్లుల సామర్థ్యం, ఖాళీలను కచ్చితంగా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. రేషన్ సన్నబియ్యంలో నూకల శాతాన్ని తగ్గించడం ద్వారా ఈ అక్రమాలకు అడ్డుకట్ట వేయవచ్చు. ఒకవైపు సంక్షేమ పథకాల అమలు, మరోవైపు పేరుకుపోయిన రూ. 65,000 కోట్లకు పైగా సర్వీస్, డెవలప్‌మెంట్ బకాయిలను సమతుల్యం చేసుకోవడం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి అత్యంత సంక్లిష్టమైన సవాలుగా మారింది. పన్నుయేతర ఆదాయాన్ని పెంచుకోవడం, ప్రాధాన్యతా ప్రాజెక్టులను సవరిస్తూ క్రమశిక్షణతో కూడిన ఆర్థిక నిర్వహణను పాటించకపోతే.. ఈ బకాయిల సుడిగుండం రాష్ట్ర యంత్రాంగాన్ని మరింత ప్రతిష్టంభనలోకి నెట్టే ప్రమాదం ఉందని ఆర్థిక విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

కాంగ్రెస్ కు సవాల్ గా ఎమ్మెల్సీ ఎన్నికలు!

వరంగల్ : తెలంగాణలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు కాంగ్రెస్ కు సవాల్ గా మారనున్నాయి. ఇద్దరు రెడ్డి సామాజికవర్గం అభ్యర్థులను ప్రకటించడం కొంత ఇబ్బందిగా మారనుందన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి. రెండు పట్టభద్రుల అయితే రెండు ఎమ్మెల్సీ స్థానాలను కైవసం చేసుకోవడానికి అధికార కాంగ్రెస్ పార్టీ పక్కా వ్యూహంతో ముందుకు సాగుతోంది. ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న కాంగ్రెస్ నాయకత్వం, ప్రధాన ప్రతిపక్షాలకు అవకాశం ఇవ్వకుండా ముందస్తుగా పావులు కదుపుతోంది. మహబూబ్‌నగర్?రంగారెడ్డి?హైదరాబాద్, వరంగల్?ఖమ్మం?నల్గొండ స్థానాల్లో ఇద్దరు అభ్యర్థులను కాంగ్రెస్ ముందుగానే ప్రకటించింది. ఇది బీసీల్లో ఒకింత అసంతృప్తికి కారణమయ్యాయని సొంత పార్టీ నేతలే చెబుతున్నారు. గెలుపు గుర్రాలే లక్ష్యంతో అభ్యర్థులను ఎంపిక చేసినప్పటికీ అన్ని సమయాల్లో సామాజికవర్గం, ఆర్థిక పరిస్థితులు ఉపయోగపడవని కొందరు గుర్తు చేస్తున్నారు. అయితే కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న ప్రధాన వ్యూహాలు మాత్రం పకడ్బందీగానే ఉన్నట్లు పార్టీ నేతలు చెబుతున్నారు.అందరికంటే ముందే అభ్యర్థుల ప్రకటించడం ఒకింత కలసి వచ్చే అంశంగా చెబుతున్నారు. ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ, ప్రత్యర్థి పార్టీల కంటే ముందే అభ్యర్థులను ప్రకటించి కాంగ్రెస్ ప్రచారంలో ముందుగు వేసింది. ఏఐసీసీ ఆమోదంతో రెండు స్థానాలకు బలమైన అభ్యర్థులను ఖరారు చేసింది. మహబూబ్‌నగర్?రంగారెడ్డి?హైదరాబాద్ స్థానానికి టీపీసీసీ మీడియా వింగ్‌లో పనిచేసిన సామ రామ్మోహన్ రెడ్డిని, వరంగల్?ఖమ్మం?నల్గొండ స్థానానికి మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి కుమారుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని ఎంపిక చేసింది. ఇద్దరూ ఆర్థికంగా బలమైన నేతలే కావడంతో పాటు ఆ యా ప్రాంతాల్లో పట్టున్న నేతలుగా గుర్తింపు పొందడం తమకు కలసి వచ్చే అంశంగా కాంగ్రెస్ పార్టీ నాయకత్వం భావిస్తుంది. రెండు స్థానాల్లో గెలుపు కోసం కాంగ్రెస్ అన్ని వ్యూహాలను సిద్ధం చేసుకుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు మంత్రులను ఇన్ ఛార్జులుగా నియమించారు. సామాజిక సమీకరణాల కంటే గెలుపు గుర్రాలకే ప్రాధాన్యత ఇచ్చినట్లు పార్టీ నాయకత్వం తెలిపింది. ఈ ఎన్నికల్లో కేవలం సామాజిక సమీకరణాలను మాత్రమే కాకుండా పట్టభద్రుల్లో అభ్యర్థులకు ఉన్న వ్యక్తిగత బలం, నెట్‌వర్క్, ప్రచార సామర్థ్యం మరియు గెలిచే అవకాశాల ఆధారంగానే అభ్యర్థులను ఎంపిక చేసింది. అయితే ఇరు స్థానాల్లోనూ రెడ్డి సామాజికవర్గానికి సీట్లు కేటాయించడంపై బీఆర్ఎస్ వంటి ప్రత్యర్థి పార్టీలు విమర్శలు గుప్పిస్తున్నాయి. ఈ ఎన్నికల్లో గెలుపు ఓటర్ల నమోదుపైనే ఆధారపడి ఉంటుందని గ్రహించిన కాంగ్రెస్, రెండు నియోజకవర్గాల పరిధిలో దాదాపు 7 లక్షల మంది పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయించాలని లక్ష్యంగా పెట్టుకుంది. యువతను, కొత్తగా డిగ్రీలు పూర్తి చేసిన ఓటర్లను డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా చేర్పించేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపడుతోంది. శాసనసభ్యులు , పార్లమెంట్ సభ్యులు , నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లు, డీసీసీ అధ్యక్షులు మరియు కార్పొరేషన్ ఛైర్మన్లను క్షేత్రస్థాయిలోకి దించి ఓటర్ల నమోదు మరియు ప్రచార బాధ్యతలను అప్పగించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ నాయకత్వం నిర్ణయించింది. ముఖ్యంగా జీహెచ్ఎంసీ పరిధిలో బీఆర్ఎస్ బలంగా ఉన్నందున, హైదరాబాద్–రంగారెడ్డి రీజియన్‌పై కాంగ్రెస్ ప్రత్యేక నిఘా పెట్టింది.నిరుద్యోగులు, ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యలపై ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని టార్గెట్ చేసే అవకాశం ఉన్నందున, ఉద్యోగ నోటిఫికేషన్లు మరియు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను పట్టభద్రుల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి పాజిటివ్ ఓటింగ్ సాధించాలని కాంగ్రెస్ ప్రణాళికలు రచిస్తోంది.

రూ. 65 వేల కోట్ల పెండింగ్ బిల్లులు!

- రేవంత్ ప్రభుత్వానికి ఆర్థిక సవాల్!



హైదరాబాద్, : తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. డిసెంబర్ 2023లో బాధ్యతలు చేపట్టిన నాటికి గత ప్రభుత్వం నుంచి వారసత్వంగా లభించిన రూ. 40,000 కోట్ల మేర పాత బిల్లులను క్లియర్ చేయడం కొత్త ప్రభుత్వానికి పెద్ద బాధ్యతగా మారింది. అందులోంచి ప్రాథమికంగా దాదాపు రూ. 8,000 కోట్ల బకాయిలను ప్రభుత్వం చెల్లించినప్పటికీ, నిరంతరం సమకూరుతున్న కొత్త బిల్లులు, పరిపాలనా వ్యయాల కారణంగా పెండింగ్ బిల్లుల భారం తగ్గే బదులు రెట్టింపైంది. ప్రస్తుతం కాంట్రాక్టర్లు, మాజీ సర్పంచులు, సరఫరాదారుల బకాయిలే ఏకంగా రూ. 51,000 కోట్లు దాటిపోవడం రాష్ట్ర ఆర్థిక ఆరోగ్య పరిస్థితికి అద్దం పడుతోంది.రోడ్లు, నీటిపారుదల, ఇతర మౌలిక వసతుల పనులు చేపట్టిన కాంట్రాక్టర్లతో పాటు గ్రామాల్లో అభివృద్ధి పనులు పూర్తి చేసిన మాజీ సర్పంచులు బిల్లులు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ చెల్లింపులు నిలిచిపోవడంతో బ్యాంకుల నుంచి తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక కాంట్రాక్టింగ్ రంగానికి చెందిన చిన్న, మధ్యతరహా వ్యాపారులు సంక్షోభంలో కూరుకుపోయారు. ఇదివరకు చేపట్టిన పనులకే నిధులు విడుదల కాకపోవడంతో నూతన అభివృద్ధి పనుల నిమిత్తం టెండర్లు పిలిచేందుకు లేదా కాంట్రాక్టర్లు ముందుకు వచ్చేందుకు వెనుకంజ వేస్తున్నారు. ఇది రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి కార్యక్రమాల వేగాన్ని తీవ్రంగా మందగించేలా చేస్తోంది.ఈ వరుస బకాయిలకు తోడు ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల చెల్లింపుల సమస్య మరీ జటిలంగా మారింది. ఆగస్టు 2026 నాటికి ఉద్యోగులు, రిటైర్డ్ సిబ్బందికి చెల్లించాల్సిన మొత్తం బకాయిలు రూ. 14,000 కోట్లకు చేరుకున్నాయి. విధుల్లో ఉన్న సిబ్బందికి చెందిన డీఏ బకాయిలు, సరెండర్ లీవ్ గ్రాంట్లు రూ. 6,200 కోట్ల మేర పేరుకుపోగా, రిటైర్డ్ ఉద్యోగుల జీపీఎఫ్ , పెన్షన్ ప్రయోజనాల బకాయిలు ఏకంగా రూ. 8,000 కోట్లు దాటాయి. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ. 4,575 కోట్ల బకాయిలను విడుదల చేసినట్లు చెబుతున్నప్పటికీ, ఈ ఒక్క ఏడాదిలోనే సుమారు 9,000 మంది ఉద్యోగులు విధి నిర్వహణ నుంచి పదవీ విరమణ పొందడంతో గ్రాట్యుటీ, పెన్షన్ ఎన్‌క్యాష్‌మెంట్ భారం కొత్తగా వచ్చి చేరింది.

గేటర్ ఎన్నికలపై ఆచితూచి అడుగులు

హైదరాబాద్, ఖైరతాబాద్ శాసనసభ స్థానానికి ఉపఎన్నిక అనివార్యమైంది. సుప్రీంకోర్టు తీర్పుతో ఖైరతాబాద్ ఉపఎన్నికల కౌంట్‌డౌన్ ప్రారంభం కాగా, రాజ్యాంగ నిబంధనల ప్రకారం ఆరు నెలల వ్యవధిలోనే ఇక్కడ ఎన్నికలు పూర్తి కావాల్సి ఉంది. అయితే ఖైరతాబాద్‌తో పాటు విస్తృతమైన గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ వ్యాప్తంగా స్థానిక సమరానికి ఎందుకు ముహూర్తం ఖరారు కావడం లేదనేది ఇప్పుడు హైదరాబాద్ రాజకీయాల్లో ఆసక్తికరమైన చర్చగా మారింది. జీహెచ్‌ఎంసీ పాలకమండలి పదవీకాలం ఫిబ్రవరిలోనే ముగిసినప్పటికీ, ప్రభుత్వం మున్సిపల్ ఎన్నికల వైపు వేగంగా అడుగులు వేయకపోవడం వెనుక పలు రాజకీయ, పరిపాలనాత్మక కారణాలు ఉన్నాయి.గ్రేటర్ పాలనను మరింత వేగవంతం చేసేందుకు జీహెచ్‌ఎంసీని మూడు మున్సిపల్ కార్పొరేషన్లు హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్‌గిరిగా విభజించారు. ఈ విభజన తదుపరి పునర్విభజన , వార్డుల సంఖ్య పెంపు, బీసీ రిజర్వేషన్లపై కోర్టుల్లో నడుస్తున్న వివాదాలు ప్రభుత్వం ముందుకు రాకుండా అడ్డంకిగా మారాయి. ఖైరతాబాద్ ఉపఎన్నిక ఎలాగూ తప్పదు కాబట్టి, అదే ఊపులో గ్రేటర్ ఎన్నికలను కూడా నిర్వహించి ముగించేస్తే ఒక పని అయిపోతుందనే ప్రతిపాదన ఉన్నప్పటికీ, కాంగ్రెస్ నాయకత్వం మాత్రం అత్యంత జాగ్రత్తగా అడుగులు వేస్తోంది. నిజానికి గ్రేటర్ పరిధిలో ఇప్పటివరకు జరిగిన రెండు అసెంబ్లీ ఉపఎన్నికల్లోనూ కాంగ్రెస్ జయకేతనం ఎగురవేసింది. ఈ వరుస విజయాలు అధికార పార్టీకి మంచి మైలేజ్ ఇచ్చాయనడంలో సందేహం లేదు. అయినప్పటికీ గ్రేటర్ కార్పొరేషన్ స్థానిక పోరు విషయంలో కాంగ్రెస్ పార్టీ నాయకత్వం ఎందుకు సందేహిస్తోంది? మొదటిది, అసెంబ్లీ లేదా పార్లమెంట్ ఉపఎన్నికల సరళి వేరు, మున్సిపల్ వార్డు స్థాయి ఎన్నికల సరళి వేరు. కార్పొరేటర్ల స్థాయి పోరులో స్థానిక సమస్యలు, తాగునీరు, డ్రైనేజీ, రహదారులు, మూసీ పునరుజ్జీవన పథకం వల్ల ప్రభావితమైన నిర్వాసితుల అసంతృప్తి నేరుగా ఓటింగ్‌పై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన కొన్ని ఆక్రమణల తొలగింపు కార్యక్రమాలు గ్రేటర్ పరిధిలోని మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి వర్గాల్లో కొంత కలకలం రేపాయి. ఈ పరిస్థితుల్లో ముందస్తుగా గ్రేటర్ ఎన్నికలకు వెళ్తే అది ప్రతిపక్షాలైన బీఆర్ఎస్, బీజేపీలకు కలిసివస్తుందేమోననే భయం కాంగ్రెస్ స్థానిక నేతల్లో ఉందనే ప్రచారం ఉంది.రెండవది, కాంగ్రెస్‌కు హైదరాబాద్ నగర పరిధిలో ఉన్న బలమైన



కేడర్ కొరత. గతంలో ఎంఐఎం, బీఆర్ఎస్‌లకు గ్రేటర్‌లో పక్కా యంత్రాంగం ఉంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇతర పార్టీల నుంచి కొంతమంది విలీనమైనప్పటికీ, వార్డు స్థాయిలో 300 వార్డుల పరిధిలో సరైన అభ్యర్థులను నిలబెట్టి గెలిపించుకోవడం కాంగ్రెస్‌కు ఐక్యతాపరంగా పెద్ద సవాలుగా మారనుంది. పార్టీ అంతర్గత విభేదాలు బయటపడితే గ్రేటర్ గెలుపుపై ప్రభావం పడుతుందనే యోచనలో నాయకత్వం ఉంది. ఖైరతాబాద్ ఉపఎన్నిక ఫలితం కాంగ్రెస్‌కు లిట్మస్ టెస్ట్‌గా మారబోతోంది. ఒకవేళ ఖైరతాబాద్‌లో దానం నాగేందర్ , కాంగ్రెస్ అభ్యర్థి భారీ మెజారిటీతో విజయం సాధిస్తే, ఆ పొలిటికల్ వేవ్‌ను వాడుకుని తక్షణమే గ్రేటర్ కార్పొరేషన్ ఎన్నికలకు నోటిఫికేషన్ ఇచ్చే అవకాశాలను ప్రభుత్వం పరిశీలిస్తోంది. అప్పటివరకు న్యాయస్థానాల్లో ఉన్న లీగల్ అడ్డంకులను క్లియర్ చేసి, వార్డుల రిజర్వేషన్లను ఖరారు చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించింది.రాబోయే 3 నుంచి 4 నెలల్లో ఖైరతాబాద్ ఉపఎన్నికతో పాటు గ్రేటర్ సమరంపై రేవంత్ రెడ్డి సర్కార్ ఒక స్పష్టమైన నిర్ణయానికి రాక తప్పదు.

సెల్ఫ్ గోల్ రాజకీయంతో రేవంత్

హైదరాబాద్, : కాంగ్రెస్ పార్టీ మత రాజకీయాలను సరికొత్త కోణంలో ప్రమాదకరమైన ప్రయోగానికి తెరలేపింది. భారతీయ జనతా పార్టీ సుదీర్ఘకాలంగా నిర్మించుకుంటూ వస్తున్న హిందూత్వ ఓటు బ్యాంకుకు విరుగుడు కనిపెట్టే ఆత్రుతలో కాంగ్రెస్ నాయకత్వం సరికొత్త వివాదాలకు ఆజ్యం పోస్తోంది. గతంలో పార్లమెంట్‌లో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ భగవాన్ శివుడి చిత్రాన్ని ప్రదర్శిస్తూ ప్రసంగించిన బాటలోనే.. తాజాగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ వేదికగా ఆర్య-ద్రావిడ వాదాన్ని, శైవం-వైష్ణవం పేరిట దేవుళ్లకే వర్గ విభజన ఆపాదిస్తూ చేసిన వ్యాఖ్యలు జాతీయ స్థాయిలో తీవ్ర దుమారాన్ని రేపుతున్నాయి.రాముడు ధనికుల దేవుడు-శివుడు పేదల దేవుడు.. ఉత్తరాది వారు ఆర్యులు, దేవుడిగా రాముడిని కొలిస్తే.. దక్షిణాది వారమైన మేము ద్రావిడులం, శివుడిని ఆరాధిస్తాం.. బీజేపీ రాముడిని హైజాక్ చేసింది అంటూ సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు తీవ్ర కలకలం రేపాయి. ఒక రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి, హిందూ దైవ కుటుంబంలో అత్యంత ప్రధానమైన శ్రీరాముడు, పరమశివుడి మధ్య పేద, ధనిక అంతరాలను సృష్టించడం విపరీతమైన విమర్శలకు దారితీసింది. ప్రాంతీయంగా ద్రావిడ వాదాన్ని ఎత్తుకుంటూనే, దైవ భావనకు కూడా వర్గ పోరాటం రంగు పులమడం కాంగ్రెస్ అనుసరిస్తున్న నూతన రాజకీయ విభజన వ్యూహానికి నిదర్శనమని భావిస్తున్నారు.హిందూ సమాజంలో చారిత్రకంగా అనేక సంప్రదాయాలు ఉన్నప్పటికీ, రాముడు, శివుడు అనే వ్యత్యాసాలు లేకుండా హరిహరులు గా కలిసి ఆరాధించే సంస్కృతి భారత్‌లో ఉంది. ముఖ్యంగా తెలంగాణలోనే భద్రాచలం శ్రీరాముడిని దక్షిణ అయోధ్య గా, వేములవాడ రాజరాజేశ్వర స్వామిని దక్షిణ కాశీ గా సమానంగా పూజిస్తారు. ఇటువంటి పుణ్యక్షేత్రాలు ఉన్న ప్రాంతానికి చెందిన నేతలే.. రాజకీయ ప్రయోజనాల కోసం దేవుళ్లను ఉత్తర-దక్షిణ భాగాలుగా, ధనిక-పేద వర్గాలుగా విభజించడం వెనుక క్షేత్రస్థాయిలో రాజకీయ లబ్ధి పొందాలనే ఆరాటం స్పష్టంగా కనిపిస్తోంది. కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మకంగా హిందూ సంప్రదాయాలను విభజించడం ద్వారా బీజేపీ ఏకీకృత హిందూ ఓటు బ్యాంకును దెబ్బతీయవచ్చని అంచనా వేస్తోంది.వ్యూహాత్మకంగా కాంగ్రెస్ వేస్తున్న ఈ అడుగులు ఆ పార్టీకే రివర్స్ అయ్యే ప్రమాదం కనిపిస్తోంది. ఇటువంటి భక్తి, విశ్వాసాల



కేంద్రంగా జరిగే విభజన రాజకీయాలు ఆఖరికి బీజేపీకే రాజకీయంగా అత్యధిక ప్రయోజనాన్ని చేకూరుస్తాయి. హిందూ దేవుళ్లను రాజకీయాల్లోకి లాగి, వారిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం ద్వారా మెజారిటీ ఓటర్లలో కాంగ్రెస్‌పై ప్రతికూల భావన ఏర్పడేలా చేయడం బీజేపీకి చాలా సులభమవుతుంది. ఈ వ్యాఖ్యలను అస్త్రంగా చేసుకుని కాంగ్రెస్ హిందూ వ్యతిరేక సిద్ధాంతాన్ని, నకిలీ సెక్యులరిజాన్ని పాటిస్తోంది అని బీజేపీ విస్తృతంగా ప్రచారం చేయడానికి అవకాశం లభిస్తుంది. హిందూత్వను నేరుగా ఎదుర్కోలేక, దానిని ముక్కలు చేసేందుకు శివుడు లబ రాముడు, ఉత్తరాది లబ దక్షిణాది సమీకరణాలు తేవడం వల్ల పోలరైజేషన్ జరుగుతుంది. ఇది కాంగ్రెస్‌కు ఉన్న లౌకిక లేదా తటస్థ ఓటర్లను కూడా దూరం చేసే ప్రమాదం ఉంది. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తన ప్రాచీన ధార్మిక క్షేత్రాల పునర్నిర్మాణం ద్వారా ఇప్పటికే ఉత్తర-దక్షిణ తేడా లేకుండా విశ్వాసులలో స్థానం సంపాదించుకుంది. కాబట్టి దేవుళ్లను విభజించే యత్నం సాధారణ భక్తుల్లో ఆగ్రహాన్ని కలిగించి, ఓట్ల రూపంలో బీజేపీ వైపే దారితీస్తుందన్న అభిప్రాయం బలంగా వినిపిస్తోంది. కాంగ్రెస్ పార్టీ హిందూత్వ సిద్ధాంతానికి విరుగుడుగా తెస్తున్న ఈ విభజన కౌంటర్ వ్యూహం సెల్ఫ్ గోల్ అయ్యే అవకాశాలే ఎక్కువ. విశ్వాసాలను రాజకీయం చేసి, దేవుళ్లకు వర్గ భేదాలు ఆపాదించడం ద్వారా కాంగ్రెస్ సాధించేదనకంటే కోల్పోయేదే ఎక్కువని తెలంగాణ రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. భావజాల పరంగా స్పష్టమైన ప్రత్యామ్నాయాన్ని ప్రజల ముందు ఉంచకుండా, ఇటువంటి సున్నితమైన అంశాలను కెలికితే అది బీజేపీ నేతృత్వంలోని పొలరైజేషన్ వ్యూహానికి మరింత నెయ్యి పోసినట్లే అవుతుందన్న అభిప్రాయం బలంగా వినిపిస్తోంది.

సమాజం బాగుపడాలని





సమాజం పట్ల కొంతమంది ఎంతో బాధ్యతగా ఉంటారు. తమిళనాడు తిరుచ్చికి చెందిన విజయ్ కుమార్ అలాంటివారే. చనిపోయిన వారికి గౌరవం, జీవించి వున్న వారికి జ్ఞానం, సంస్కృతిని కాపాడడం ఆయన దినచర్యల్లో భాగం. ఒకే వ్యక్తి ఇన్ని రకాల పనులు చేయడం చూస్తే ఆశ్చర్యమేస్తుంది. కానీ విజయ్ కుమార్ దాన్ని సాధ్యం చేసి చూపిస్తున్నారు. ఆయన అడుగుజాడల్లో భార్య, కూతురు కూడా కలిసి నడవడం చూసి ఎంతోమంది స్ఫూర్తిని పొందుతున్నారు.

విజయ్ కుమార్‌కి 50 ఏళ్లు. ఆయన తన 25 ఏళ్ల నుండే పుస్తకాలు సేకరించడం, గ్రంథాలయం నిర్వహించడం విధిగా చేస్తున్నారు. పుస్తకాలు చదువుకోవాలనుకున్న వారికి ఉచితంగా వాటిని పంపిణీ చేస్తారు. గ్రంథాలయానికి వచ్చి చదువుకునే వారి దగ్గర నుండి కూడా ఏవిధమైన రుసుము వసూలు చేయరు. పుత్తూరులో ఈయన నిర్వహించే గ్రంథాలయంలో 25 వేల పుస్తకాలు ఉన్నాయి. పుస్తకాలని విజయ్ కుమార్ ఎంతలా ప్రేమిస్తారో ఆయన మాటలను బట్టే అర్థమవుతుంది. 'పుస్తకాలు లేని ఇల్లు కిటికీలు లేని గోడ వంటిది. తెరిచిన గ్రంథాలయాలు జైళ్ల గోడలను మూసి వుంచుతాయి. మంచి పుస్తకాలు చదవడం జ్ఞానాన్ని మెరుగుపరుచుకోవడంతో సమానం' వంటి మాటలు తరచూ విజయ్ కుమార్ అంటుంటారు. పుస్తక జ్ఞానాన్ని ప్రజలకు ఇంతలా చేరువ చేస్తున్న అతని కృషికి ప్రశంసలు, అవార్డులు కూడా దక్కాయి.

సాధారణంగా చనిపోయిన వారి ఇంటికి వెళ్లినా, శ్మశానం వరకు వెంట నడిచినా చాలా ఇళ్లల్లో గొడవ చేస్తారు. విజయ్ కుమార్ ఇంట్లో వాళ్లు మాత్రం అలా కాదు. ఆయన భార్య చిత్ర, కూతురు కీర్తన అనాథలకి అతను చేసే అంత్యక్రియల్లో భాగమవుతారు. రోడ్ల మీద, బస్టాండ్‌లు, రైల్వే స్టేషను, నదీతీరాల్లో అనాథలుగా పడిఉన్న శవాలకి విజయ్ కుమార్ ఎంతో శ్రద్ధగా చివరి క్రతువులు నిర్వహిస్తారు. కోవిడ్ సమయంలో కూడా కుటుంబ సభ్యులు కూడా దగ్గరికి రాని మృతదేహాలకు ఈ కుటుంబం అంత్యక్రియలు చేసింది. 'ఈ పని చేస్తున్నందుకు ఎంతోమంది నిందించారు. అయినా మా పని ఎప్పుడూమానలేదు' అని చిత్రచెబుతున్నారు. గ్రంథాలయం, అనాథశవాల అంత్యక్రియలు నిర్వహించే విజయ్ కుమార్‌కి తమిళ సంస్కృతి చిహ్నాలను కాపాడడం చాలా ఇష్టం. పురాతన వస్తు సముదాయాలు నిండిన ఆయన ఇల్లు ఒక చిన్నసైజు మ్యూజియంలా ఉంటుంది. దీనిగురించి ఆయన ఇలా అంటున్నారు. 'తిరుచ్చిలోని అన్ని గ్రామాలు తిరుగుతాను. కొన్ని సార్లు జిల్లా నుండి బయటికి కూడా వెళతాను. నేను సేకరించిన వస్తువులను తమిళం, ఇంగ్లీషు భాషల్లో డాక్యుమెంటరీ కూడా చేశాను. పరిశోధనల కోసం కాలేజీ విద్యార్థులు ఇక్కడికి వస్తుంటారు. పురాతన కాలంలో వాడిన నాగళ్లు, మట్టి కుండలు, ధాన్యం సేకరణ వస్తువులు, వెదురుబుట్టలు, వ్యవసాయరంగంలో వాడే వివిధ పనిముట్లు, నాణేలు, కరెన్సీ కాగితాలు వంటి వన్నీ సేకరిస్తాను' అని విజయ్ కుమార్ చెప్పారు.న్యాయవాద వృత్తిలో ఉన్న చిత్ర, ఎల్ఎల్‌బి చదువుతున్న కీర్తన తమ బిజీ లైఫ్‌లో కూడా విజయ్ కుమార్‌కి అండగా నిలవడం వెనుక ఒకే ఒక్క ఉమ్మడి లక్ష్యం దాగుంది. అది సమాజం పట్ల బాధ్యతగా ఉండడం.

ఖైరతాబాద్ బరిలో కవిత పార్టీ!

హైదరాబాద్, : ఎమ్మెల్యే దానం నాగేందర్ కాంగ్రెస్ వైపు అడుగులు వేసి ఎంపీగా పోటీ చేయడంతో ముంచుకొచ్చిన ఖైరతాబాద్ అసెంబ్లీ ఉపఎన్నిక తెలంగాణ రాజకీయాల్లో ఊహించని మలుపులు తిరుగుతోంది. బీఆర్ఎస్ నుంచి బయటకు వచ్చి, తెలంగాణ రక్షణ సేన పేరుతో కొత్త రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన కల్వకుంట్ల కవిత.. ఈ ఉపఎన్నిక బరిలో తమ పార్టీ అభ్యర్థిని దించుతామని ప్రకటించడం ప్రాధాన్యత సంతరించుకుంది. పార్టీ ఆవిర్భావం తర్వాత ఎదుర్కొంటున్న తొలి ఎన్నిక కావడంతో, ఖైరతాబాద్ పోరు తెలంగాణ రక్షణ సేనకు తమ ఉనికిని, క్షేత్రస్థాయి ప్రభావాన్ని చాటుకునే ప్రతిష్టాత్మక పరీక్షగా మారనుంది.ఈ ఎన్నికల్లో కవిత నేతృత్వంలోని పార్టీకి ప్రధాన లక్ష్యం తక్షణమే సీటును కైవసం చేసుకోవడం కాకపోవచ్చు. ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీల త్రిముఖ పోటీ మధ్య తమకంటూ ఒక ప్రత్యేకమైన ఓటు బ్యాంకు, సిద్ధాంతపరమైన స్థానం ఉందని నిరూపించుకోవడమే ఆమె అసలైన పొలిటికల్ ఎజెండాగా కనిపిస్తోంది. బిఆర్ఎస్ నుంచి సస్పెన్షన్, జైలు జీవితం తర్వాత "సామాజిక తెలంగాణ" నినాదంతో ప్రజాక్షేత్రంలోకి వచ్చిన కవితకు.. హైదరాబాద్ నడిబొడ్డున జరిగే ఈ బైపోల్ ఒక లిట్మస్ టెస్ట్ లాంటిది. ప్రధాన పార్టీలకు గట్టి పోటీ ఇస్తూ ఓట్లను రాబట్టగలిగితే, రాబోయే స్థానిక సంస్థలు, అసెంబ్లీ ఎన్నికలకు టీఆర్ఎస్‌ను ఒక ప్రత్యామ్నాయ శక్తిగా నిలబెట్టే అవకాశం దక్కుతుంది.ఖైరతాబాద్ నియోజకవర్గ భౌగోళిక, సామాజిక సమీకరణాలు పరిశీలిస్తే ఇక్కడ పోటీ అత్యంత విలక్షణంగా ఉంటుంది. బస్తీల్లో ఉండే శ్రామిక వర్గాలు, కాలనీల్లోని మధ్యతరగతి ప్రజలు, హైటెక్ ఉద్యోగులు, ఐటీ ఆధారిత వ్యాపారవేత్తలు, విద్యావంతులు పెద్ద సంఖ్యలో ఇక్కడ నివసిస్తున్నారు. స్థానికంగా మంచి పట్టుండి, ప్రజాదరణ పొందిన బలమైన అభ్యర్థిని బరిలోకి దించగలిగితే తెలంగాణ రక్షణ సేన ప్రధాన పార్టీల గెలుపోటములను ప్రభావితం చేసే కింగ్ మేకర్ గా మారే ప్రభావం చూపుతుంది. ఈ ఉపఎన్నికలో కవితకు అతిపెద్ద ప్లస్ పాయింట్ మహిళా ఓటర్లు. గతంలో తెలంగాణ జాగృతి ద్వారా బతుకమ్మ సంస్కృతిని విశ్వవ్యాప్తం చేయడం, మహిళా సాధికారత అంశాలపై పోరాడటం వల్ల తెలంగాణ సెంటిమెంట్‌తో పాటు మహిళల్లో ఆమెకు



ప్రత్యేక గుర్తింపు ఉంది. ఖైరతాబాద్ వంటి అర్బన్ నియోజకవర్గంలో మహిళా ఓటర్ల శాతం అధికంగా ఉండటం వల్ల.. ధరల పెరుగుదల, ఉచిత బస్సు ప్రయాణాల అమలు తీరు, మహిళా భద్రత, స్థానిక సమస్యలపై ఆమె చేసే ప్రచారం మహిళల ఓట్లను ఆకర్షించే అవకాశం ఉంది. ఇది అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్‌ల సాంప్రదాయ మహిళా ఓటు బ్యాంకుకు గండికొట్టడం ఖాయంగా కనిపిస్తోంది.దానం నాగేందర్ పార్టీ మార్పు , రాజ్యాంగబద్ధమైన పదవుల దుర్వినియోగంపై కవిత తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నారు. ఒక గుర్తుపై గెలిచి మరొక పార్టీకి వెళ్లడం ప్రజాస్వామ్యాన్ని పరిహసించడమే అని ప్రజల్లోకి తీసుకెళ్తూ, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను, బీఆర్ఎస్ అంతర్గత ఒప్పందాలను ఒకేసారి ఎండగట్టే వ్యూహాన్ని అమలు చేస్తున్నారు. రాజధాని నగరంలోని విద్యావంతులు, తటస్థ ఓటర్లు ప్రజాస్వామ్య సూత్రాలకు ప్రాధాన్యమిస్తే.. ఈ రాజకీయం కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండింటికీ తలనొప్పిగా మారనుంది. ఖైరతాబాద్ ఉపఎన్నిక ఫలితాల సరళిని తలకిందులు చేసే శక్తి తెలంగాణ రక్షణ సేనకు ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. గెలుపు ఓటముల కంటే కూడా, తాము సాధించే ఓట్ల శాతమే భవిష్యత్తులో తెలంగాణ రాజకీయాల్లో కవిత ఎంతవరకు ప్రభావం చూపగలరనే దానికి ప్రామాణికంగా నిలుస్తుంది. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు సైతం కవిత అభ్యర్థిత్వం , వ్యూహాలను తేలిగ్గా తీసుకోలేక, తమ ఓటు బ్యాంకును కాపాడుకునేందుకు కొత్త సమీకరణాలను తెరపైకి తెచ్చే పరిస్థితి ఏర్పడింది.

భారీగా వీసాల రిజెక్ట్...



న్యూఢిల్లీ, : అగ్రరాజ్యం అమెరికా వెళ్లాలి.. డాలర్లు సంపాదించాలి అనేది ఒకప్పుడు సంపన్నుల కల.. కానీ ఇప్పుడు మధ్య తరగతి వారు కూడా అమెరికా వెళ్తున్నారు. అయితే డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షుడు అయ్యాక సీన్ మారిపోయింది. వీసా ఆంక్షలు, నిబంధనలతో అమెరికా వెళ్లేందుకు చాలా మంది వెనుకాడుతున్నారు. అయితే ట్రంప్ రాకముందు కూడా పరిస్థితి ఇలాగే ఉంది. 2024లో ప్రపంచ దేశాలకు చెందిన చాలా వీసాలు తిరస్కరణకు గురయ్యాయి. 2024లో అమెరికా బీ1/బీ2 వీసాలు (బిజినెస్, టూరిజం) తిరస్కార రేట్లు ప్రపంచవ్యాప్తంగా భిన్నంగా ఉన్నాయి. లైచెన్‌స్టీన్, మోనాకో వంటి దేశాల్లో 0%తోపాటు, భారత్ 16.32%తో మధ్యస్థ స్థాయిలో ఉంది. ఈ డేటా ఆర్థిక స్థితి, రాజకీయ సంబంధాలు, ఇమ్మిగ్రేషన్ రిస్క్‌లపై ఆధారపడి ఉంది.చాలా అధిక ఆదాయ దేశాలు తక్కువ తిరస్కారాలు ఎదుర్కొన్నాయి. ఇవి స్థిరమైన ఆర్థిక వ్యవస్థలు, తక్కువ ఇమ్మిగ్రేషన్ రిస్క్ కలిగి ఉన్నాయి. తక్కువ ఆదాయ దేశాల వీసాలు ఎక్కువగా తిరస్కరణకు గురయ్యాయి. లైచెన్‌స్టీన్, మొనాకో, నార్త్ కొరియా కు చెందిన ఒక్క వీసా కూడా ఆమోదం పొందలేదు. యూఏఈ 1.46 శాతం, జపాన్ 5.76 శాతం, సౌదీ అరేబియా 7.89 శాతం వీసాలు తిరస్కరణకు గురయ్యాయి.భారత్ 16.32%తో 18వ స్థానంలో ఉంది. యూరప్ దేశాలు (ఫ్రాన్స్ 8.50%, జర్మనీ 10. 02%) కంటే ఎక్కువ కానీ చైనా (25.37%), పాకిస్తాన్ (45.65%) కంటే మెరుగు. భారతీయుల్లో ఐటీ ప్రొఫెషనల్స్, విద్యార్థులు ఎక్కువగా అప్లై చేస్తున్నారు. డాక్యుమెంట్లు, ఆర్థిక నిరూపణలు బలంగా ఉంటే సక్సెస్ రేటు పెరుగుతుంది. సంఘర్షణలు, పేదరికం, ఇమ్మిగ్రేషన్ చరిత్ర కారణంగా కొన్ని దేశాల్లో 50% మించి తిరస్కారాలు జరిగాయి. ఇరాన్ 55.54 శాతం, కెనడా 56.35 శాతం, ఆఫ్గానిస్తాన్ 48.89 శాతం, నైజీరియా 46.51 శాతం, పాకిస్తాన్ 45.65 శాతం వీసాలు తిరస్కరణకు గురయ్యాయి. కెనడా వంటి అధిక ఆదాయ దేశం కూడా అధిక రేటు ఉండటం ఆశ్చర్యకరం హెచ్?1బీ వీసాలపై యూఎస్‌కు వెళ్లి బీ1/బీ2 అప్లై చేసే ట్రెండ్ కారణం.వీసా ఇస్తే అమెరికాలోనే స్థిరపడతారనే అనుమానం(భారత్, చైనా వంటి దేశాల్లో ఎక్కువ). ఉద్యోగం, ఆదాయం నిరూణ లేకపోవడం, అసంపూర్ణ పత్రాలు, పారికార్డులు, యుద్ధాలు, అస్తిరణ(ఆఫ్గాన్, ఇరాన్) తదితర కారణాలతో అమెరికా వీసాలు తిరస్కరిస్తోంది. స్విట్జర్లాండ్, సింగపూర్ వంటి దేశాలు తక్కువ రేట్లు కలిగి ఉంటే, భారతీయులు బలమైన టైస్ (ఫ్యామిలీ, జాబ్) చూపించాలి.ఈ డేటా అమెరికా వీసా పాలసీల ప్రపంచ డైనమిక్స్‌ను తెలియజేస్తుంది. భారత్ మెరుగైన స్థానంలో ఉన్నప్పటికీ, మరింత చైతన్యం అవసరం.

గులాబీ కోటలను బద్దలు కొడతారా?

కరీంనగర్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాజకీయ కంచుకోటగా భావించే సిరిసిల్ల నియోజకవర్గంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్వహించిన అధికారిక అభివృద్ధి కార్యక్రమాలు, రాజకీయ బహిరంగ సభ మార్పు సంకేతాలు ఇచ్చింది. అధికారంలో ఉన్న పార్టీ నిర్వహించే ఏ సభకైనా యంత్రాంగం, నిధుల అండతో జనాన్ని సమీకరించడం సహజమే అయినప్పటికీ.. సిరిసిల్ల సభకు తరలివచ్చిన జనసందోహంలో ఒక ఆర్గానిక్ ఉత్సాహం కొట్టొచ్చినట్లు కనిపించింది. బలవంతపు తరలింపులకు, స్వచ్ఛందంగా తరలివచ్చే ప్రజా స్పందనకు మధ్య ఉండే విభజన రేఖ ఈ సభలో స్పష్టంగా రుజువైంది. కేటీఆర్‌కు ఎదురేలేదని భావించిన స్వంత గడ్డపైనే ఇంతటి భారీ స్థాయిలో కాంగ్రెస్ బలప్రదర్శన విజయవంతం కావడం గులాబీ శిబిరాన్ని ఆత్మరక్షణలోకి నెట్టింది.తెలంగాణ ఉద్యమ కాలం నుంచి సుదీర్ఘంగా ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న కేటీఆర్‌పై స్థానికంగా యాంటీ-ఇన్‌కంబెన్సీ నెమ్మదిగా బలపడుతోందన్న సంకేతాలు చాలాకాలంగా వినిపిస్తున్నాయి. ఉద్యమ సెంటిమెంట్ పూర్తిగా కనుమరుగైపోవడంతో.. ప్రజలు ఇకపై కేవలం భావోద్వేగాల ఆధారంగా కాకుండా, క్షేత్రస్థాయి పాలన, నేత అందుబాటులో ఉండే తీరు, చేనేత-రైతు సంక్షేమ హామీల అమలు ఆధారంగానే తమ రాజకీయ తీర్పులను నిర్ణయించే వాస్తవికతలోకి వచ్చారు. గత పదేళ్లలో ఐటీ హబ్‌లు, హైటెక్ మౌలిక వసతుల పేరిట జరిగిన ప్రచారం క్షేత్రస్థాయి సామాన్యుల జీవితాలను ఎంతవరకు మార్చిందనే ప్రశ్నలు ఇప్పుడు బలంగా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా గల్ఫ్ బాధితుల సమస్యలు, నేతన్నల ఆత్మహత్యల నివారణలో గత ప్రభుత్వ వైఫల్యాలు ఇప్పటికీ పచ్చిగానే ఉండటం స్థానిక అసంతృప్తికి ఆజ్యం పోస్తోంది.ఈ ప్రజా వ్యతిరేకత కేవలం అసెంబ్లీ సభతోనే మొదలుకాలేదు. మొన్నటి లోక్‌సభ ఎన్నికల్లోనే దీనికి స్పష్టమైన సంకేతాలు కనిపించాయి. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో



ఉన్న సిరిసిల్ల అసెంబ్లీ సెగ్మెంట్‌లో బీజేపీ ఎంపీ బండి సంజయ్‌కు భారీ మెజారిటీ లభించడం కేటీఆర్ రాజకీయ ఆధిపత్యానికి పడిన మొదటి గట్టి ఎదురుదెబ్బ. కేటీఆర్ తన సొంత ఇలాకాలోనే ఆధిక్యాన్ని కాపాడుకోలేకపోయారన్న నిజం.. ఓటర్ల మైండ్‌సెట్ మారిపోయిందనడానికి తిరుగులేని ఆధారంగా నిలిచింది. ఒకప్పుడు బీఆర్ఎస్‌కు ఏకపక్ష మద్దతు ఇచ్చిన ఓటర్లు క్రమంగా బీజేపీ వైపు మొగ్గు చూపడం ప్రారంభించగా.. ఇప్పుడు ఆ రాజకీయ శూన్యంలోకి కాంగ్రెస్ వేగంగా చొచ్చుకువెళ్లేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వేస్తున్న ఎత్తుగడలు సిరిసిల్ల రాజకీయాలను మునుపటి కేటీఆర్ వర్సెస్ ఇతరులు స్థాయి నుంచి మార్చి, కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ ప్రధాన పోరుగా తీర్చిదిద్దే దిశగా సాగుతున్నాయి. గత లోక్ సభ ఎన్నికల ఫలితాలతో రెండో స్థానానికి వెళ్లిన బీఆర్ఎస్‌ను పూర్తిగా మూడో స్థానానికి పరిమితం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వ యంత్రాంగాన్ని, సంక్షేమ పథకాలను రేవంత్ సిరిసిల్లాపై కేంద్రీకరిస్తున్నారు.

హైదరాబాద్‌లో 3 కారిడార్లలో పీఆర్‌టీఎస్...



హైదరాబాద్, : హైదరాబాద్ నగరంలో నానాటికీ పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యను తగ్గించడం కోసం రేవంత్ రెడ్డి సర్కారు కీలక నిర్ణయం తీసుకుంది. మూడు ప్రధాన మార్గాల్లో పర్సనల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్‌ను అందుబాటులోకి తేవడానికి ఆమోదం తెలిపింది. డిసెంబర్‌లోగా పనులు ప్రారంభించి.. 2027 చివరి నాటికి పీఆర్టీఎస్ సేవలు అందుబాటులోకి తేవాలని సీఎం రేవంత రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇందులో కేపీహెచ్‌బీ నుంచి బయోడైవర్సిటీ మెట్రో స్టేషన్ (ప్రతిపాదిత) వరకు ఏర్పాటు చేయబోయే మార్గం కీలకం కానుంది. హైదరాబాద్ నగరంలోని ఐటీ ఉద్యోగులకు తెలంగాణ సర్కారు గుడ్ న్యూస్ చెప్పింది. కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు (కేపీహెచ్‌బీ) మెట్రో స్టేషన్ నుంచి త్వరలో రానున్న బయోడైవర్సిటీ మెట్రోస్టేషన్ వరకు పర్సనల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ (పీఆర్టీఎస్) ఏర్పాటుకు సీఎం రేవంత్ రెడ్డి ఆమోదం తెలిపారు. కేపీహెచ్‌బీ మెట్రో స్టేషన్ నుంచి దుర్గం చెరువు, రహేజా మైండ్ స్పేస్ మీదుగా బయోడైవర్సిటీ మెట్రో స్టేషన్ వరకు పీఆర్టీఎన్‌ను ఏర్పాటు చేయనున్నారు. హైదరాబాద్ నగరంలోని ఐటీ సంస్థలు ప్రధానంగా పశ్చిమ ప్రాంతంలోని హైటెక్ సిటీ, గచ్చిబౌలి, కొండాపూర్ ప్రాంతాల్లో ఉన్నాయి. దీంతో ఐటీ ఉద్యోగులు ఎక్కువగా కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ, మియాపూర్, నిజాంపేట్, బాచుపల్లి, చందానగర్ ప్రాంతాల్లో ఎక్కువగా నివసిస్తు?న్నారు. మియాపూర్ నుంచి రాయదుర్గం వరకు మెట్రో సేవలు అందుబాటులో ఉన్నాయి. అయితే మెట్రోలో వెళ్లాలంటే చుట్టూ తిరుగుతూ అమీర్‌పేట మీదుగా 17 కి.మీ. ప్రయాణించాల్సి వస్తోంది. అంతే కాకుండా అమీర్‌పేటలో రైలు మారాలి. అత్యంత రద్దీగా ఉండే ఈ మార్గంలో.. ఎక్కువ దూరం ప్రయాణించడం, రైలు మారాల్సి రావడం ఐటీ ఉద్యోగులకు ఇబ్బందికరంగా ఉంది. దీంతో చాలా మంది ఇప్పటికీ కార్లు, బైకుల, ట్యాక్సీల మీదే ఆఫీసులకు వెళ్తున్నారు. దీంతో గచ్చిబౌలి నుంచి కేపీహెచ్‌బీ వెళ్లే రూట్‌లో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటోంది. పీఆర్టీఎస్ అందుబాటులోకి వస్తే ట్రాఫిక్ సమస్య తగ్గుతుందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. దీంతో డిసెంబర్ నాటికి టెండర్లు పూర్తి చేసి.. 2027 చివరి నాటికి పీఆర్టీఎస్‌ను అందుబాటులోకి తేవాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఐటీ కారిడార్‌లో పీఆర్టీఎస్ సాధ్యాసాధ్యాలపై లీ అసోసియేట్స్ సమర్పించిన రిపోర్టు ఇప్పటికే సిద్ధంగా ఉంది కాబట్టి వెంటనే పనులు చేపట్టాలని సీఎం ఆదేశించారు. హైదరాబాద్ నగరంలోని ఐటీ కారిడార్లలో మొత్తం 34.46 కిలోమీటర్ల మేర పీఆర్టీఎస్‌ను ప్రతిపాదించారు. అయితే తక్షణ ప్రాధాన్యంగా కేపీహెచ్‌బీ నుంచి రాయదుర్గం వరకు 7.62 కి.మీ. మార్గా?న్ని మొదటి జోన్‌లో భాగంగా అందుబాటులోకి తేనున్నారు. తర్వాత దీన్ని మిగతా ఐటీ కారిడార్ మొత్తానికి విస్తరించనున్నారు. ఐటీ కారిడార్‌తోపాటు హైదరాబాద్ కోర్ సిటీలోనూ మరో రెండు మార్గాల్లో పీఆర్టీఎస్ ఏర్పాటు చేయడానికి సీఎం రేవంత్ రెడ్డి ఆమోదం తెలిపారు. ఎల్బీ స్టేడియం నుంచి రాణిగంజ్ బస్టాండ్ వరకు ఒక లైన్ కాగా.. అసెంబ్లీ మెట్రో నుంచి బేగంపేటకు మరో లైన్ ఉండనుంది. ఎల్బీ స్టేడియం నుంచి అంబేద్కర్ విగ్రహం, ఇందిరా పార్క్, లోయర్ ట్యాంక్ బండ్ మీదుగా రాణిగంజ్ బస్టాండ్ వరకు మొదటి లైన్ ఉంటుంది. రెండో లైన్లో రవీంద్ర భారతి, సచివాలయం, ఐమ్యాక్స్ ప్రాంతాలు కూడా కవర్ అవుతాయి. అయితే వీటిలో అసెంబ్లీ నుంచి బేగంపేట పీఆర్టీసీ లైన్ ఏర్పాటు కొంత ఆలస్యమయ్యే అవకాశం ఉంది. మెట్రోకు అనుసంధానంగా పాడ్ కార్లు.. కూకట్‌పల్లిలో ఖఖీూ భారీ డిపో.. 104 ఎకరాల్లో ఏర్పాటు..!గచ్చిబౌలి ఐకియా ప్రాంతంతోపాటు నెక్లెస్ రోడ్‌లో మల్టీ లెవల్ పార్కింగ్‌లు ఏర్పాటు చేసి పీఆర్టీఎస్ డిపోలు ఏర్పాటు చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. 2027 చివరి నాటికి పీఆర్టీఎస్ సేవలు అందుబాటులోకి వస్తే.. ఐటీ కారిడార్లో ట్రాఫిక్ సమస్య తగ్గే అవకాశం ఉంది. ఐటీ ఉద్యోగులు 15 నిమిషాల్లోపే కేపీహెచ్‌బీ నుంచి మైండ్ స్పేస్‌కు చేరుకునే అవకాశం ఉంటుంది. తొలి దశ పీఆర్టీఎస్ సేవలు అందుబాటులోకి వస్తే.. 2030 నాటికి రోజుకు 75 వేల మందికిపైగా ప్రయాణికులు ఈ సేవలను వాడుకునే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

ఉత్తర తెలంగాణలో పీట్టు సాధించేది ఎలా..?



కరీంనగర్: తెలంగాణ రాజకీయాల్లో ఒకప్పుడు తిరుగులేని ఆధిపత్యం చలాయించిన బీఆర్ఎస్, వరుస ఎన్నికల పరాజయాల తర్వాత డీలా పడింది. ఇప్పుడు తన పూర్వ వైభవాన్ని తిరిగి పొందేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. ముఖ్యంగా పార్టీకి కంచుకోటలుగా ఉన్న ఉత్తర తెలంగాణ జిల్లాలపై బీఆర్ఎస్ అధిష్ఠానం ప్రత్యేక దృష్టి సారించింది. 2004 నుంచి పార్టీకి బలమైన పునాదిగా ఉన్న ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో కోల్పోయిన పట్టును తిరిగి సాధించడం ఇప్పుడు బీఆర్ఎస్ ముందున్న అతిపెద్ద సవాలు. పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్వయంగా ఈ పునరుజ్జీవ కార్యక్రమాలకు నాయకత్వం వహిస్తున్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఎదురైన చేదు అనుభవాలను సమీక్షించుకున్న తర్వాత, క్షేత్రస్థాయిలో పార్టీ క్యాడర్‌ను తిరిగి ఉత్తేజపరిచేందుకు ఒక నెల రోజుల పాటు వరుస బహిరంగ సభలు, సమావేశాలకు ప్రణాళిక రూపొందించారు. గోదావ రిఖనిలో జరిగిన సింగరేణి కార్మిక గర్జనతో మొదలైన ఈ రాజకీయ యాత్ర, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లోని రైతు సదస్సుల మాదుగా సాగుతూ, నవంబర్ 29న కరీంనగర్‌లో నిర్వహించనున్న 'దీక్షా దివస్' వేదుకల తో పతాక స్థాయికి చేరనుంది. కార్మికులు, రైతులు, తెలంగాణ ఉద్యమ సెంటిమెంట్ అనే మూడు ప్రధాన అంశాలను ఎంచుకోవడం ద్వారా, తమ సంప్రదాయ ఓటు బ్యాంకును తిరిగి ఆకట్టుకోవాలని బీఆర్ఎస్ భావిస్తోంది.అయితే.. ఉత్తరతెలంగాణలో బీఆర్ఎస్‌కు పరిస్థితులు అంత సులభంగా లేవు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ స్థానాలను బీజేపీ కైవసం చేసుకోవడం గులాబీ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ. కేవలం ఎన్నికల ప్రచారాలకే పరిమితం కాకుండా, బీజేపీ తన సంస్థాగత బలాన్ని కూడా ఈ ప్రాంతంలోగణనీయంగా పెంచుకుంది. ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లో బీసీ నాయకత్వాన్ని ప్రోత్సహించడం, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ కేంద్ర సహాయ మంత్రిగా ఉండటం వంటి అంశాలు బీజేపీకి క్షేత్రస్థాయిలో బలాన్ని చేకూర్చాయి.మరోవైపు, అధికారంలోఉన్న కాంగ్రెస్ పార్టీ నుంచి కూడా బీఆర్ఎస్ గట్టి పోటీని ఎదుర్కొంటోంది. గతంలో తమ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను గుర్తు చేయడం ద్వారానే ఓట్లు రాబట్టవచ్చన్న వ్యూహం ఇప్పుడు ఫలించడం లేదు. సింగరేణి ప్రాంతంలో 18,000 మంది వారసులకు ఉద్యోగ అవకాశా లు కల్పించామని, కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు సాగునీరు అందించామని బీఆర్ఎస్ నేతలు పదేపదే ప్రస్తావి స్తున్న ప్పటికీ, అవి ఎన్నికల్లో ఓట్లుగా మారలేదన్నది స్పష్టమైంది. రాజకీయా ల్లో పాత విధేయతలు, గత చరిత్ర కేవలం ఒక ఆరంభం మాత్రమే అవుతాయి తప్ప, వాటినే శాశ్వత విజయాలకు గ్యారెంటీగా తీసుకోలేము. కార్యకర్తల్లో నెలకొన్న అసంతృప్తిని తొలగించడం, క్షేత్రస్థాయిలో బలహీనపడిన పార్టీ యంత్రాంగాన్ని పునర్నిర్మించడం, ఒకేసారి బీజేపీ, కాంగ్రెస్ వంటి రెండు బలమైన ప్రత్యర్థులను సమర్థవంతంగా ఎదుర్కోవడం కేటీఆర్ ముందున్న తక్షణ కర్తవ్యాలు. గత పాలనా విజయాలను చెప్పుకోవడంతో పాటు, ప్రజల ప్రస్తుత సమస్యలపై పోరాడుతూ క్షేత్రస్థాయిలో తమ ఉనికిని బలంగా చాటుకున్నప్పుడే ఉత్తర తెలంగాణలో బీఆర్ఎస్ మళ్లీ పుంజుకునే అవకాశం ఉంటుంది. ఈ నెల రోజుల కార్యాచరణ గులాబీ దళానికి నిజమైన అగ్నిపరీక్షగా మారనుంది.

ట్రూఅప్ ఛార్జీలు కూడా ఫ్రీ, 54.79 లక్షల మందికి ఊరట



హైదరాబాద్: తెలంగాణలో గృహజ్యోతి పథకం కింద ఉచిత విద్యుత్ పొందుతున్న 54.79 లక్షల కనెక్షన్లకు ట్రూఅప్ ఛార్జీలను కూడా ప్రభుత్వమే చెల్లించనుంది. గతంలో విద్యుత్ వినియోగం 200 యూనిట్లు దాటినా.. ప్రస్తుతం పథకం అర్హత ఉంటే ఈ మినహాయింపు వర్తిస్తుంది. దీంతో లబ్ధిదారులకు జీరో బిల్లులు కొనసాగనున్నాయి. ఈ నిర్ణయం వల్ల వచ్చే రెండేళ్లలో ప్రభుత్వంపై సుమారు రూ.500 కోట్ల అదనపు భారం పడనుంది.తెలంగాణలో గృహజ్యోతి పథకం లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం మరోసారి ఊరటనిచ్చింది. ఉచిత విద్యుత్ పథకం కింద నెలకు 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించే కుటుంబాలపై ట్రూఅప్ ఛార్జీల భారం పడకుండా నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకం కింద అర్హత పొందిన 54,79,383 విద్యుత్ కనెక్షన్లకు ట్రూఅప్ ఛార్జీలను కూడా ప్రభుత్వమే డిస్కంలకు చెల్లించనుంది. దీంతో ఈ నెల నుంచి అన్ని వర్గాల విద్యుత్ వినియోగదారుల బిల్లుల్లో ట్రూఅప్ ఛార్జీలు అదనంగా చేరుతున్నప్పటికీ గృహజ్యోతి లబ్ధిదారులకు మాత్రం యథావిధిగా జీరో బిల్లులే జారీ అవుతున్నాయి.సాధారణంగా విద్యుత్ పంపిణీ సంస్థలు 2022-23, 2023-24 ఆర్థిక సంవత్సరాల్లో వినియోగించిన విద్యుత్‌కు సంబంధించిన ట్రూఅప్ ఛార్జీలను ఇప్పుడు వసూలు చేస్తున్నాయి. ఈ నెల బిల్లులో యూనిట్‌కు 30 పైసలు చొప్పున, వచ్చే నెల నుంచి యూనిట్‌కు 50 పైసల చొప్పున మొత్తం 24 నెలలపాటు ఈ మొత్తాన్ని వినియోగదారుల నుంచి వసూలు చేయనున్నాయి. అయితే గృహజ్యోతి పథకం కింద ప్రస్తుతం ఉచిత విద్యుత్ పొందుతున్న కుటుంబాలకు ఈ భారం వర్తించకుండా ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. గతంలో 2022-23, 2023-24 సంవత్సరాల్లో నెలకు 200 యూనిట్లకు మించి విద్యుత్ వినియోగించినప్పటికీ ప్రస్తుతం గృహజ్యోతి పథకం అర్హత కలిగిన వినియోగదారుల ట్రూఅప్ ఛార్జీలను కూడా ప్రభుత్వమే భరిస్తుందని డిస్కంలు స్పష్టం చేశాయి.ఈ నిర్ణయంతో గృహజ్యోతి పథకం అమలుకు ప్రభుత్వంపై ఆర్థిక భారం మరింత పెరగనుంది. 2024లో ఈ పథకం ప్రారంభమైన సమయంలో నెలకు సుమారు రూ.170 కోట్లను ప్రభుత్వం విద్యుత్ పంపిణీ సంస్థలకు చెల్లించేది. ప్రస్తుతం లబ్ధిదారుల సంఖ్య, విద్యుత్ వినియోగానికి అనుగుణంగా ఆ మొత్తం నెలకు రూ.210 కోట్లకు చేరింది. తాజాగా ట్రూఅప్ ఛార్జీలను కూడా ప్రభుత్వమే భరించనుండటంతో ఈ నెలలో అదనంగా రూ.16 కోట్లకు పైగా చెల్లించాల్సి వస్తుందని అంచనా వేస్తున్నారు. వచ్చే 24 నెలల్లో గృహజ్యోతి లబ్ధిదారులకు సంబంధించిన ట్రూఅప్ ఛార్జీల రూపంలో ప్రభుత్వం సుమారు రూ.500 కోట్ల వరకు చెల్లించాల్సి ఉంటుందని డిస్కంల వర్గాలు వెల్లడిస్తున్నాయి.మరోవైపు గృహజ్యోతి పథకానికి కొత్త లబ్ధిదారులు కూడా పెరుగుతున్నారు. రేషన్‌కార్డు ఉండి, అర్హతలు కలిగి ఉన్నప్పటికీ ఇప్పటివరకు జీరో బిల్లు అందని కుటుంబాల నుంచి అధికారులు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. దీంతో రానున్న రోజుల్లో ఈ పథకం పరిధిలోకి వచ్చే విద్యుత్ కనెక్షన్ల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. మొత్తంగా ఉచిత విద్యుత్‌తో పాటు ట్రూఅప్ ఛార్జీల భారాన్ని కూడా ప్రభుత్వం భరించనుండటంతో లక్షలాది కుటుంబాలకు విద్యుత్ బిల్లుల విషయంలో అదనపు ఊరట లభించనుంది.

డిసెంబర్ వరకే హైదరాబాద్‌కు నీళ్లు..

ఆ తర్వాత తీవ్ర కొరత తప్పదా..?



హైదరాబాద్: హైదరాబాద్ మహానగరాన్ని మంచినీటి కొరత ముప్పు వెంటాడుతోంది. నగరానికి నీటిని అందించే సింగూరు, మంజీరా జలాశయాల్లో ప్రస్తుతం ఉన్న నిల్వలు మరో 42 రోజులకు మాత్రమే సరిపోనున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే డిసెంబర్ తర్వాత నగరంలోని పలు ప్రాంతాలకు నీటి సరఫరాలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. సింగూరు, మంజీరా జలాశయాల నుంచి నీటి సరఫరా జరిగే ప్రాంతాలపై కొరత ప్రభావం పడే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. శేరిలింగంపల్లి, పటాన్‌చెరు, జూబ్లీహిల్స్, కూకట్‌పల్లి, సనత్‌నగర్, రాజేంద్రనగర్, ఖైరతాబాద్ నియోజకవర్గాల్లో నీటి సరఫరా కష్టతరంగా మారవచ్చని భావిస్తున్నారు. వీటిలో ముఖ్యంగా శేరిలింగంపల్లి నియోజకవర్గంపై ప్రభావం ఎక్కువగా ఉండొచ్చని హెచ్చరికలు వెలువడుతున్నాయి. సింగూరు, మంజీరా జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గుతున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ మార్గాలపై అధికారులు దృష్టి సారించారు. ప్రస్తుతం ఈ రెండు జలాశయాల నుంచి నీళ్లు సరఫరా అవుతున్న ప్రాంతాలకు గోదావరి జలాలను మళ్లించే అవకాశాలను పరిశీలిస్తున్నారు. ఇందుకు సంబంధించిన ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. సకాలంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోతే నగరంలోని పలు ప్రాంతాల్లో నీటి సరఫరాపై ప్రభావం పడే ప్రమాదం ఉందని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో గోదావరి జలాల వినియోగంపై నిపుణులు కీలక ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. సుమారు ఆరు నెలల క్రితం గోదావరి నీటిని కిందకు వదలకుండా నిల్వ చేసుకుని ఉంటే ప్రస్తుత పరిస్థితి ఎదురయ్యేది కాదని వారు అభిప్రాయపడుతున్నారు. నీటి లభ్యత, భవిష్యత్తు అవసరాలను ముందుగానే అంచనా వేసి జలవనరుల నిర్వహణ చేపట్టాల్సి ఉండేదని విమర్శిస్తున్నారు.

ధరలు పెంచిన వోల్వో కార్స్ ఇండియా



ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల వల్ల ముడిసరుకులతో పాటు షిప్పింగ్, లాజిస్టిక్స్ ఖర్చులు విపరీతంగా పెరిగిపోతున్నాయని, ఈ కారణంగా తమ లగ్జరీ కార్ల ధరలను పెంచడం అనివార్యమని వోల్వో కార్స్ ఇండియా తెలిపింది. తమఫ్లాగ్‌షిప్ ఎలక్ట్రిక్ వెహికల్ ఈఎక్స్90 లాంచ్ సందర్భంగా వోల్వో కార్స్ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ జ్యోతి మల్హోత్రా మాట్లాడుతూ.. అంతర్జాతీయంగా సరుకుల రవాణా డెలివరీ సమయం పెరగడంతో పాటు షిప్పింగ్ ఖర్చులు పెరిగాయని, ఈఅదనపు ఉత్పత్తి వ్యయాన్ని తప్పనిసరి పరిస్థితుల్లో వినియోగదారులకు బదిలీ చేయక తప్పట్లేదని స్పష్టం చేశారు.
ప్రస్తుతం దేశీయంగా తమ మొత్తం విక్రయాల్లో నాలుగో వంతు వాటా ఎలక్ట్రిక్ వాహనాల నుంచే వస్తోంది. ఇకపై ప్రతి సంవత్సరం భారత మార్కెట్లోకి ఒక కొత్త ఎలక్ట్రిక్ కారును విడుదల చేస్తామని ఆయన ప్రకటించారు. ప్రస్తుతం మార్కెట్లో ఉన్న రెండు ఈవీలతో పాటు త్వరలోనే ఎస్‌యూవీ ఈఎస్90, సెడాన్ ఈఎస్90 మోడల్ కార్లను అందుబాటులోకి తీసుకొస్తామని, అదే సమయంలో సాంప్రదాయ ఇంధన వాహనాల మైల్డ్ హైబ్రిడ్ వెర్షన్లను కూడా కస్టమర్లకు అందుబాటులో ఉంచుతామని ఆయన స్పష్టం చేశారు.

జియో మొత్తం ముకేశ్ అంబానీది కాదా?

ఐపీవో వేళ బయటపడ్డ షాకింగ్ నిజాలు!



భారతీయ స్టాక్ మార్కెట్ చరిత్రలోనే కనీవినీ ఎరుగని సరికొత్త రికార్డుకు రంగం సిద్ధమైంది. దేశంలోనే అతిపెద్ద ఐపీవోగా జియో ప్లాట్‌ఫామ్స్ దలాల్ స్ట్రీట్‌లోకి అడుగుపెట్టేందుకు ముహూర్తం ఖరారైంది. దాదాపు రూ.37,700 కోట్ల భారీ నిధుల సమీకరణే లక్ష్యంగా రాబోతున్న ఈ మెగా ఇష్యూ కోసం మదుపరులు వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. అయితే మార్కెట్లను ఊపేస్తున్న ఈ భారీ ఐపీవో వేళ ఒక బయటపడ్డ షాకింగ్ నిజాలు అందరినీ విస్మయానికి గురిచేస్తోంది. ఇప్పటివరకు దేశమంతా జియో అంటే కేవలం ముకేశ్ అంబానీ సొంత సామ్రాజ్యం అనుకుంటోంది. కానీ మార్కెట్ రెగ్యులేటర్‌కు సమర్పించిన ముసాయిదా పత్రాలు (ఆఖీఊఖ) మాత్రం పూర్తి భిన్నమైన నిజాన్ని బయటపెట్టాయి. జియో ప్లాట్‌ఫామ్స్‌పై రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు పూర్తి యాజమాన్య హక్కులు లేవన్నదే ఇప్పుడు ట్రేడింగ్ వర్గాల్లో పెను సంచలనంగా మారింది. డ్రాఫ్ట్ రెడ్ హెరింగ్ ప్రాస్పెక్టస్ నివేదికల ప్రకారం.. జియోలో రిలయన్స్ ఇండస్ట్రీస్ వాటా కేవలం 66.43 శాతం మాత్రమే. మిగిలిన 33 శాతానికి పైగా భారీ వాటాను ప్రపంచ టెక్ దిగ్గజాలు, అంతర్జాతీయ సావరిన్ వెల్త్ ఫండ్‌లు చేజిక్కించుకున్నాయి. మొత్తం 105 మంది వాటాదారుల పెట్టుబడులతో జియో నడుస్తోంది. ముకేశ్ అంబానీ కేవలం టెలికాం ఆపరేటర్‌గా కాకుండా, అంతర్జాతీయ స్థాయి డిజిటల్ పవర్‌హౌస్‌గా జియోను తీర్చిదిద్దడం వల్లే ప్రపంచ స్థాయి కార్పొరేట్ శక్తులు ఇందులో భాగస్వామ్యం అయ్యాయి. రిలయన్స్ తర్వాత జియోలో రెండో అతిపెద్ద వాటాదారుగా సోషల్ మీడియా దిగ్గజం మెటా (ఫేస్‌బుక్) అనుబంధ సంస్థ 'జాదూ హోల్డింగ్స్ ఎల్ఎల్సీ' నిలిచింది. దీనికి ఏకంగా 9.98 శాతం వాటా ఉంది. మరో టెక్ దిగ్గజం గూగుల్ ఇంటర్నేషనల్ ఎల్ఎల్సీ 7.73 శాతం వాటాతో మూడో స్థానంలో ఉంది. వీటితో పాటు సౌదీ అరేబియాకు చెందిన పబ్లిక్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ (ఖఎఈ) 2.31 శాతం, కేకేఆర్ అనుబంధ సంస్థ ఒమిక్రాన్ ఏషియా హోల్డింగ్స్ 2.31 శాతం, విస్టా ఈక్విటీ పార్ట్‌నర్స్ 2.31 శాతం చొప్పున వాటాలను కలిగి ఉన్నాయి. సిల్వర్ లేక్, ముబాదలా, జనరల్ అట్లాంటిక్ వంటి మరిన్ని గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సంస్థలు సైతంజియోలో కీలక భాగస్వాములుగా ఉండటం అంతర్జాతీయ స్థాయిలో జియో బలాన్ని చాటుతోంది. ఈ మెగా ఇష్యూలో అత్యంత కీలకమైన అంశం ఏంటంటే.. ఇందులో ఎలాంటి 'ఆఫర్ ఫర్ సేల్' భాగం లేదు.సాధారణంగా ఐపీవో వచ్చిందంటే పాత ఇన్వెస్టర్లు తమ వాటాలను అమ్ముకుని లాభాలతో బయటపడటం ఆనవాయితీ. కానీ జియో ప్లాట్‌ఫామ్స్‌లో ఉన్న ఏ ఒక్క పాత ఇన్వెస్టర్ కూడా తమ వాటాలను విక్రయించడం లేదు. కంపెనీ భవిష్యత్తు, డిజిటల్ విస్తరణపై గ్లోబల్ దిగ్గజాలకు ఉన్న తిరుగులేని నమ్మకానికి ఇది నిదర్శనం. కంపెనీ మార్కెట్ నుంచి సమీకరించే రూ.37,700 కోట్ల మొత్తాన్ని 27 కోట్ల సరికొత్త ఈక్విటీ షేర్లను జారీ చేయడం ద్వారానే సేకరించనుంది. ఒక్కో షేరు ప్రైస్ బ్యాండ్ దాదాపు రూ.1,065 నుంచి రూ.1,119 మధ్య ఉండే అవకాశం ఉందని మార్కెట్ వర్గాల అంచనా.

భారత వృద్ధి రేటు 7 శాతం...

- ఐఎంఎఫ్ తాజా అంచనాలు విడుదల



భారత ఆర్థిక వ్యవస్థ పటిష్టమైన వేగంతో ముందుకు సాగుతుందని అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఎఓఈ) తన తాజా 'పరల్డ్ ఎకనామిక్ ఔట్‌లుక్' నివేదికలో స్పష్టం చేసింది. 2026- 2027 ఆర్థిక సంవత్సరాల్లో భారత జీడీపీ (ఉఆఖ) వృద్ధి రేటు స్థిరంగా 7.0 శాతంగా నమోదవుతుందని ఐఎంఎఫ్ అంచనా వేసింది. బలమైన దేశీయ డిమాండ్, సేవల రంగం విస్తరణ, నిర్మాణాత్మక సంస్కరణలు భారత ఆర్థిక పురోగతికి ఊతమిస్తున్నాయని నివేదిక పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా ప్రతికూల పరిస్థితులు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు నెలకొన్నప్పటికీ, అంతర్జాతీయంగా అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా భారత్ తన ఆధిక్యాన్ని నిలబెట్టుకోనుందని సంస్థ అభిప్రాయపడింది. మరోవైపు అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థపై ఐఎంఎఫ్ హెచ్చరికలు జారీ చేసింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ నిలకడగానే ఉన్నప్పటికీ, ఆ నిలకడ క్రమంగా బలహీనపడుతూ అసమానతలకు దారితీస్తోందని పేర్కొంది. ప్రపంచ వృద్ధి రేటు 2026 లో 3.1 శాతంగా, 2027 లో 3.4 శాతంగా మాత్రమే నమోదు కావచ్చని అంచనా వేసింది. ముఖ్యంగా ఇంధన, ఆహార ఉత్పత్తుల ధరలు భారీగా పెరగడం వల్ల ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యోల్బణం 4.7 శాతానికి చేరుకునే ప్రమాదం ఉందని ఐఎంఎఫ్ హెచ్చరించింది. 2026-2027 ఆర్థిక సంవత్సరాల్లో భారత జీడీపీ (ఉఆఖ) వృద్ధి రేటు స్థిరంగా 7.0 శాతంగా నమోదవుతుందని ఐఎంఎఫ్ అంచనా వేసింది. బలమైన దేశీయ డిమాండ్, సేవల రంగం విస్తరణ, నిర్మాణాత్మక సంస్కరణలు భారత ఆర్థిక పురోగతికి ఊతమిస్తున్నాయని నివేదిక పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా ప్రతికూల పరిస్థితులు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు నెలకొన్నప్పటికీ, అంతర్జాతీయంగా అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా భారత్ తన ఆధిక్యాన్ని నిలబెట్టుకోనుందని సంస్థ అభిప్రాయపడింది. అంతర్జాతీయ స్థాయిలో అనిశ్చితి, పెరుగుతున్న చమురు ధరల రిస్క్ పొంచి ఉన్నప్పటికీ భారత వృద్ధి రేటు 7 శాతంగా అంచనా వేయడం భారత మార్కెట్లకు, పెట్టుబడిదారులకు పెద్ద ఊరటనిచ్చినట్లయింది.

నవంబర్ 30 వరకు చక్కెర నిల్వలపై కేంద్రం కొత్త నిబంధనలు...



రాబోయే పండుగల సీజన్‌లో చక్కెర కృత్రిమ కొరతను నివారించి, వినియోగదారులకు అందుబాటు ధరల్లో చక్కెర లభించేలా చూసేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వినియోగదారుల వ్యవహారాలు, ఆహార పంపిణీ మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఈ కొత్త నిబంధనలు అక్టోబర్ 15 నుంచి అమల్లోకి వచ్చి నవంబర్ 30 వరకు కొనసాగనున్నాయి. ఈ కొత్త ఉత్తర్వుల ప్రకారం.. చక్కెర వ్యాపారులు, డీలర్లు గరిష్టంగా 1,000 క్వింటాళ్ల నిల్వలను మాత్రమే కలిగి ఉండాలి. అలాగే తాము కొనుగోలు చేసిన సరుకును 15 రోజుల వ్యవధిలోనే మార్కెట్‌లో విక్రయించాల్సి ఉంటుంది. అంతకుముందు ఈ పరిమితి 4,000 క్వింటాళ్లు (30 రోజులు) కాగా, సెప్టెంబర్‌లో 2,000 క్వింటాళ్లకు తగ్గించారు. ఇప్పుడు దీనిని మరింత కఠినతరం చేస్తూ 1,000 క్వింటాళ్లకు కుదించారు. అయితే, భౌగోళిక రవాణా ఇబ్బందులు, సుదూర ప్రాంతాల సరఫరా అవసరాలను దృష్టిలో ఉంచుకుని కోల్‌కతా, దాని పరిసర మెట్రో ప్రాంతాలతో పాటు అసోం రవాణా మార్గాలకు ఈ నిబంధనలో ప్రత్యేక మినహాయింపునిచ్చారు. అక్కడ వ్యాపారులు గరిష్టంగా 2,000 క్వింటాళ్ల వరకు సరుకును నిల్వ చేసుకునేందుకు కేంద్రం అనుమతించింది. వ్యాపారులు భారీగా చక్కెరను నిల్వ చేసి సరుకు కొరత సృష్టించకుండా నిరోధించడం, మిల్లుల నుంచి మార్కెట్‌కు చక్కెర సరఫరా వేగవంతం చేయడం ఈ చర్య ప్రధాన ఉద్దేశం. దసరా, దీపావళి పండుగల వేళ తీపి పదార్థాల తయారీకి చక్కెర వినియోగం విపరీతంగా పెరుగుతుంది. ఇటీవల ఎక్స్-మిల్ ధరకు తోడు రిటైల్ మార్కెట్‌లో ధరలు క్రమంగా తగ్గుముఖం పడుతున్న తరుణంలో, వ్యాపారులు ఈ ప్రయోజనాన్ని నేరుగా వినియోగదారులకు అందించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. తద్వారా పండుగల వేళ ప్రజలపై అదనపు భారం పడకుండా చూడాలని కేంద్రం భావిస్తోంది.

చమురు ధరలకు మళ్లీ రెక్కలు!



మరోసారి చమురు ధరలు భయపెడుతున్నాయి.. పశ్చిమ ఆసియాలో తీవ్రతరం అవుతున్న దాడులు అంతర్జాతీయ ఇంధన మార్కెట్‌లో ఆందోళనలను పెంచుతున్నాయి. సౌదీ అరేబియాలోని ఇంధన వనరులపై దాడుల ముప్పు, హార్మూజ్ జలసంధి ద్వారా చమురు రవాణాపై నెలకొన్న అనిశ్చితి.. ముడి చమురు ధరలపై ప్రభావం చూపుతున్నాయి. అక్టోబర్ 14న బ్రెంట్ క్రూడ్ బ్యారెల్‌కు 106.58 డాలర్ల వద్ద, అమెరికా వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ (డిఐ) క్రూడ్ 94.94 డాలర్ల వద్ద ట్రేడవుతున్నాయి.. దీంతో, ఆందోళన మొదలైంది.. యెమెన్‌కు చెందిన హౌతీ తిరుగుబాటుదారులు సౌదీ అరేబియా చమురు సంస్థలను లక్ష్యంగా చేసుకున్నారన్న నివేదికలు ఇంధన మార్కెట్‌ను కలవరపెడుతున్నాయి. సౌదీ అరేబియాలోని ధహ్రాన్‌లో ప్రభుత్వ యాజమాన్యంలోని చమురు, సహజ వాయువు సంస్థ సౌదీ అరామ్కోకు చెందిన పరిపాలనా భవనంపై అనుమానిత దాడి జరగడంతో స్వల్ప అగ్నిప్రమాదం సంభవించినట్లుగా తెలుస్తోంది.. ప్రపంచంలోని ప్రధాన చమురు ఉత్పత్తిదారుల్లో సౌదీ అరేబియా ఒకటి. ఆ దేశంలోని చమురు ఉత్పత్తి, నిల్వ, ఎగుమతి మౌలిక సదుపాయాలకు అంతరాయం కలిగితే అంతర్జాతీయ మార్కెట్‌పై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది. వాస్తవంగా సరఫరా తగ్గకపోయినా, భవిష్యత్తులో ఉత్పత్తి లేదా ఎగుమతులు నిలిచిపోవచ్చనే భయాలు ధరల పెరుగుదలకు కారణమవుతాయి. అందుకే మార్కెట్‌లో వ్యాపారులు భౌగోళిక రాజకీయ పరిణామాలను నిశితంగా గమనిస్తున్నారు. ప్రపంచ చమురు రవాణాలో హార్మూజ్ జలసంధి అత్యంత కీలకమైన సముద్ర మార్గం. ఈ మార్గం ద్వారా జరిగే చమురు రవాణాకు ఆటంకాలు ఏర్పడితే అంతర్జాతీయ సరఫరా వ్యవస్థపై ఒత్తిడి పెరుగుతుంది. నౌకలపై దాడులు, ట్యాంకర్ల రాకపోకలపై అనిశ్చితి, సముద్ర మార్గాల భద్రతపై ఆందోళనలు ఇప్పటికే మార్కెట్‌ను ప్రభావితం చేస్తున్నాయి. ఈ నెల ప్రారంభంలో ట్యాంకర్లపై జరిగిన దాడుల కారణంగా ఈ మార్గంలో చమురు రవాణా ప్రభావితమైనట్లు రాయిటర్స్ నివేదించింది. హార్మూజ్ మార్గంలో ఉద్రిక్తతలు మరింత పెరిగితే చమురు రవాణాలో జాప్యం జరగవచ్చు. అంతేకాకుండా నౌకల బీమా, రవాణా ఖర్చులు పెరిగే అవకాశం ఉంది. ఈ అదనపు వ్యయాలు కొనుగోలుదారులపై భారం మోపి, అంతర్జాతీయ చమురు ధరలను మరింత పెంచవచ్చు. ప్రపంచ మార్కెట్‌లో చమురు ధరలు ఏ దిశగా వెళ్తాయనేది ఇతర ఉత్పత్తిదారుల నుంచి అందుబాటులోకి వచ్చే అదనపు సరఫరాలపై కూడా ఆధారపడి ఉంటుంది. రష్యా నుంచి డీజిల్ ఎగుమతులు పెరిగే అవకాశం ఇంధన మార్కెట్‌కు కొంత ఉపశమనం కలిగించవచ్చు. అయితే, డీజిల్ సరఫరా పెరగడం వల్ల పశ్చిమ ఆసియాలో ముడి చమురు సరఫరాకు సంబంధించిన ఆందోళనలు పూర్తిగా తొలగిపోతాయని చెప్పలేం. చమురు ఉత్పత్తి కొనసాగుతున్నప్పటికీ, భద్రతాపరమైన సమస్యల కారణంగా నౌకల ద్వారా రవాణా జరగకపోతే వినియోగదారులకు అందుబాటులో ఉండే సరఫరా తగ్గవచ్చు. అందువల్ల మార్కెట్ వర్గాలు ఉత్పత్తి గణాంకాలతో పాటు సముద్ర మార్గాల పరిస్థితి, ఎగుమతుల్లో అంతరాయాలు, అదనపు సరఫరాల లభ్యతపై దృష్టి సారిస్తున్నాయి. భారతదేశం తన ఇంధన అవసరాల కోసం దిగుమతి చేసుకునే ముడి చమురుపై గణనీయంగా ఆధారపడుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు ఎక్కువ కాలం పాటు అధిక స్థాయిలో కొనసాగితే దేశ చమురు దిగుమతి బిల్లు పెరిగే అవకాశం ఉంది. అయితే, అంతర్జాతీయ ధరలు పెరిగినంత మాత్రాన దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలు వెంటనే పెరుగుతాయని చెప్పలేం. దేశీయ ఇంధన ధరలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పన్నులు, చమురు మార్కెటింగ్ కంపెనీల నిర్ణయాలు, ముడి చమురు కొనుగోలు ఖర్చులు తదితర అంశాలు ప్రభావం చూపుతాయి. అంతర్జాతీయ ధరలు ఎక్కువ కాలం అధికంగా ఉంటే చమురు కంపెనీల వ్యయాలు పెరిగే అవకాశం ఉంది. రవాణా ఖర్చులు పెరిగితే సరుకుల పంపిణీ, తయారీ రంగాలపై కూడా ప్రభావం పడవచ్చు. తద్వారా నిత్యావసర వస్తువులు, ఇతర సేవల ధరలపై ఒత్తిడి ఏర్పడే ప్రమాదం ఉంది. ముడి చమురు ధరల పెరుగుదల భారతదేశ వాణిజ్య సమతుల్యతపైనా ప్రభావం చూపవచ్చు. చమురు దిగుమతుల కోసం ఎక్కువ డాలర్లు చెల్లించాల్సి వస్తే విదేశీ కరెన్సీకి డిమాండ్ పెరిగే అవకాశం ఉంది. ఇది రూపాయిపై ఒత్తిడిని పెంచవచ్చు. అయితే, రూపాయి మారకం విలువపై ఇతర అంతర్జాతీయ ఆర్థిక పరిణామాలు కూడా ప్రభావం చూపుతాయి. అధిక చమురు ధరలు రవాణా, ఉత్పత్తి వ్యయాలను పెంచి ద్రవ్యోల్బణ అంచనాలపై ప్రభావం చూపవచ్చు.

ఐడీబీఐ బ్యాంక్ ప్రైవేటీకరణకు కేంద్రం గ్రీన్ సిగ్నల్



ప్రభుత్వ రంగ ఐడీబీఐ బ్యాంక్‌లో 60.72 శాతం వాటాను కెనడాకు చెందిన 'ఫెయిర్‌ఫాక్స్ ఫైనాన్షియల్ హోల్డింగ్స్' సంస్థకు రూ. 52,878 కోట్లకు విక్రయించే ప్రతిపాదనకు ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేబినెట్ కమిటీ ఆమోదం తెలిపింది. దీంతో ఎయిర్ ఇండియా తర్వాత దేశంలోనే అతిపెద్ద ప్రైవేటీకరణగా ఇది నిలిచింది. ఇందులో భాగంగా ప్రభుత్వం వద్ద ఉన్న 30.48 శాతం, ఎల్ఐసీ వద్ద ఉన్న 30.24 శాతం ఈక్విటీ వాటాలు ఫెయిర్‌ఫాక్స్ చేతికి వెళ్లనున్నాయి. ప్రభుత్వం, ఎల్ఐసీ కలిసి ఉమ్మడిగా 34 శాతం మైనారిటీ వాటాను కలిగి ఉంటాయి. దేశ ఆర్థిక రంగ చరిత్రలోనే రికార్డు స్థాయి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి (ఎఫ్‌డీఐ)గా నమోదు కానున్న ఈ ఒప్పందం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు పూర్తవుతుందని దీపమ్ కార్యదర్శి అరుణిష్ చావ్లా స్పష్టం చేశారు. నియంత్రణ సంస్థల ఆమోదాలు లభించిన అనంతరం ఫెయిర్‌ఫాక్స్ మైనారిటీ ఇన్వెస్టర్లకు ఓపెన్ ఆఫర్ ఇవ్వడంతో పాటు నిబంధనల ప్రకారం రెండేళ్లలోపు తమ వద్ద ఉన్న సీఎస్‌బీ బ్యాంక్ వాటాలను ఐడీబీఐలో విలీనం చేయడం లేదా ఉపసంహరించుకోవడం చేయాల్సి ఉంటుంది.

100 బిలియన్ డాలర్ల మార్కు దాటిన చైనాతో భారత్ వాణిజ్య లోటు...



చైనాతో భారత ద్వైపాక్షిక వాణిజ్యం వేగంగా పెరుగుతున్నప్పటికీ, వాణిజ్య లోటు మాత్రం 100 బిలియన్ల మార్కును దాటిపోయింది. చైనా కస్టమ్స్ శాఖ విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం.. ఈ ఏడాది మొదటి తొమ్మిది నెలల్లో భారత్-చైనాల మొత్తం వ్యాపారం 25.4 శాతం పెరిగి 144.45 బిలియన్ డాలర్ల(రూ. 13.76 లక్షల కోట్ల)కు చేరగా, ఇందులో భారత వాణిజ్య లోటు గతేడాదితో పోలిస్తే 20.7 శాతం పెరిగి 105.93 బిలియన్ డాలర్ల(రూ. 10.01 లక్షల కోట్ల) రికార్డు స్థాయికి ఎగబాకింది. ఇదే సమయంలో చైనాకు భారత ఎగుమతులు 40.7 శాతం పెరిగి 19.26 బిలియన్ డాలర్ల(రూ. 1.83 లక్షల కోట్ల)కు చేరినప్పటికీ, మన దేశ తయారీ రంగానికి అవసరమైన ఎలక్ట్రానిక్స్, యంత్రాలు, రసాయనాల కోసం చైనా నుంచి ఏకంగా 125.19 బిలియన్ డాలర్ల(రూ. 11.93 లక్షల కోట్లతో 23.3 శాతం ఎక్కువగా దిగుమతులు చేసుకోవడం వాణిజ్య లోటును విపరీతంగా పెంచేసింది. భారత్ నుంచి ఖనిజాలు, ఇంధనాలు, వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు సాగుతున్నప్పటికీ, మన ఐటీ, ఫార్మా ఉత్పత్తులకు చైనా తన మార్కెట్ తలుపులు తెరవకపోవడమే ఈ భారీ వ్యత్యాసానికి ప్రధాన కారణమని ఆర్థిక విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు.

నెట్‌ఫ్లిక్స్ లో 1000 మంది ఉద్యోగుల తొలగింపు..!



ప్రముఖ ఓటిటి దిగ్గజం నెట్‌ఫ్లిక్స్ తమ గ్లోబల్ వర్క్‌ఫోర్స్‌లో దాదాపు 6 శాతం మందిని, అంటే సుమారు 1,000 మంది ఉద్యోగులను తొలగిస్తోంది. తీవ్రమైన పోటీ, ఆదాయ వృద్ధి మందగించడం వల్ల వ్యయ నియంత్రణలో భాగంగా కంపెనీ ఈ నిర్ణయం తీసుకుంది. కంపెనీలో పనిచేస్తున్న మొత్తం సిబ్బందిలో దాదాపు 6 శాతం మందిని, అంటే సుమారు 1,000 మంది ఉద్యోగులను ఉద్యోగాల నుంచి తొలగించడానికి ప్రణాళిక సిద్ధం చేసినట్లు వాల్ స్ట్రీట్ జర్నల్ కథనం వెల్లడించింది. 2022 తర్వాత నెట్‌ఫ్లిక్స్ చేపడుతున్న అతిపెద్ద లేఆఫ్ రౌండ్ ఇదే కావడం గమనార్హం. కంపెనీ చీఫ్ ఎగ్జిక్యూటివ్‌లు గ్రెగ్ పీటర్స్, టెడ్ సరండోస్ ఉద్యోగులకు పంపిన ఇమెయిల్ ఆధారంగా ఈ సమాచారం బయటకు వచ్చింది. ఈ ఉద్యోగ కోతలు ప్రధానంగా ప్రొడక్ట్, టెక్నాలజీ, లీగల్, హ్యూమన్ రిసోర్సెస్ టీమ్‌లపై తీవ్ర ప్రభావం చూపనున్నాయి. గత ఏడాది చివరి నాటికి ప్రపంచవ్యాప్తంగా నెట్‌ఫ్లిక్స్‌లో దాదాపు 16,000 మంది పూర్తిస్థాయి ఉద్యోగులు పనిచేస్తున్నారు.కేవలం చందాల పైనే ఆధారపడకుండా నెట్‌ఫ్లిక్స్ ఇటీవల ప్రకటనలు, లైవ్ స్ట్రీమింగ్, గేమింగ్ విభాగాల్లోకి భారీగా పెట్టుబడులు మళ్లించింది. అయితే గ్లోబల్ స్ట్రీమింగ్ మార్కెట్‌లో పోటీ తీవ్రమవ్వడం, వ్యూవర్ ఎంగేజ్?మెంట్ ఆశించిన స్థాయిలో పెరగకపోవడంతో కంపెనీ ఆదాయ వృద్ధిపై తీవ్ర ఒత్తిడి నెలకొంది. ప్రేక్షకులను ఆకట్టుకోవడానికి వీడియో పాడ్‌కాస్ట్‌లు, యూట్యూబ్ క్రియేటర్ల షోలు, లైవ్ స్పోర్ట్స్ ఈవెంట్లతో పాటు ప్రత్యక్ష టీవీ ఛానెళ్లను కూడా తీసుకొచ్చేందుకు నెట్‌ఫ్లిక్స్ ప్రయత్నాలు చేస్తోంది. ఫ్రాన్స్‌లోని ప్రముఖ బ్రాడ్‌కాస్టర్ టీఎఫ్1 తో ఒప్పందం కుదుర్చుకుని అక్కడ లైవ్ ఛానెళ్లను అందుబాటులోకి తెచ్చింది. 2026 ప్రథమార్ధంలో నెట్‌ఫ్లిక్స్ వినియోగదారులు దాదాపు 97 బిలియన్ గంటల కంటెంట్‌ను వీక్షించారు. ఇది అంతకుముందు ఏడాదితో పోలిస్తే 2 శాతం మాత్రమే పెరుగుదల కావడం గమనార్హం..! మీడియా రంగంలో చోటుచేసుకుంటున్న విలీనాలు నెట్‌ఫ్లిక్స్‌కు కొత్త సవాళ్లను విసురుతున్నాయి. ఈ ఏడాది ప్రారంభంలో వార్నర్ బ్రదర్స్ డిస్కవరీ కొనుగోలు రేసులో పారామౌంట్ స్కైడాన్స్ చేతిలో నెట్‌ఫ్లిక్స్ ఓటమి పాలైంది. పారామౌంట్ సంస్థ 110 బిలియన్ డాలర్ల విలువైన విలీనాన్ని పూర్తి చేసి బహుళ స్టూడియోలతో అతిపెద్ద మీడియా గ్రూప్‌గా అవతరించింది. ఇది నెట్‌ఫ్లిక్స్ బిజినెస్ మోడల్‌పై అదనపు భారాన్ని పెంచింది. గత 12 నెలల కాలంలో నెట్‌ఫ్లిక్స్ షేర్లు దాదాపు 40 శాతానికి పైగా నష్టపోయాయి. అయితే అమెరికాలో నెట్‌ఫ్లిక్స్ చందాదారులు ప్లాన్ రద్దు చేసుకునే రేటు కేవలం 2 శాతంగానే ఉంటూ, ఇతర స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌లతో పోలిస్తే అత్యల్పంగా నమోదవ్వడం విశేషం. కాగా, కేవలం నెట్‌ఫ్లిక్స్ మాత్రమే కాకుండా టెక్, ఎంటర్‌టైన్‌మెంట్ రంగాల్లోని అగ్రగామి సంస్థలైన డిస్నీ, అమెజాన్ కూడా వ్యయాలను తగ్గించుకునే క్రమంలో గడచిన కొన్ని నెలల్లో వేలాది మంది ఉద్యోగులను తొలగించాయి.

రిలయన్స్ క్యాంపా డ్రింక్స్‌కు ఢిల్లీ హైకోర్టు బిగ్ రిలీఫ్



ముకేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు ఢిల్లీ హైకోర్టులో తాత్కాలికంగా పెద్ద ఊరట లభించింది. తమ 'క్యాంపా' ఉత్పత్తులను 'ఎనర్జీ డ్రింక్స్' పేరుతో మార్కెట్‌లో విక్రయించడం కొనసాగించడానికి కోర్టు అనుమతినిచ్చింది. భారత ఆహార భద్రతా మండలి (ఎఫ్ఎస్ఎస్ఏఐ) జారీ చేసిన ఆదేశాలను సవాలు చేస్తూ రిలయన్స్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ పిటిషన్ దాఖలు చేసింది. ఈ కేసును విచారించిన హైకోర్టు, రిలయన్స్‌పై చర్యలు తీసుకునే ముందు ఎందుకు ముందస్తు నోటీసు ఇవ్వలేదని ఎఫ్ఎస్ఎస్ఏఐని ప్రశ్నించింది. అలాగే తన తప్పును దిద్దుకోవడానికి సమయం ఉందని వ్యాఖ్యానించిన కోర్టు, తదుపరి విచారణను వాయిదా వేసింది. ఇదే అంశంపై పెప్సికో, మాన్‌స్టర్ బెవరేజ్ వంటి దిగ్గజ కంపెనీలు దాఖలు చేసిన పిటిషన్లను కూడా అదే రోజున విచారించనుంది. ఎఫ్ఎస్ఎస్ఏఐ తీసుకున్న నిర్ణయం వల్ల తమ వ్యాపారానికి భారీ నష్టం వాటిల్లిందని రిలయన్స్ కోర్టు దృష్టికి తీసుకెళ్లింది. మార్కెట్‌లో ఎనర్జీ డ్రింక్ అని ముద్రించిన 16.8 కోట్ల క్యాన్లు, 1.2 కోట్ల బాటిళ్ల స్టాక్ నిలిచిపోవడంతో పాటు మరో 7.6 కోట్ల ప్యాకేజింగ్ మెటీరియల్ వృథా అయ్యే పరిస్థితి ఏర్పడిందని పేర్కొంది.

ఉదయం నిద్ర లేవగానే చాలా సేపటి వరకు నడుము బిగుతుగా ఉంటుందా



దయం నిద్రలేవగానే నడుము బిగుసుకుపోయినట్టు అనిపించడం చాలామందికి సాధారణ సమస్యగా కనిపిస్తుంది. అయితే ఈ నొప్పి ప్రతిరోజూ కొనసాగుతూ గంటల పాటు తగ్గకపోతే, అది తీవ్రమైన వెన్నెముక సమస్యకు సంకేతం కావచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా అంకిలోజింగ్ స్పాండిలైటిస్ అనే ఆటో ఇమ్యూన్ వ్యాధి ప్రారంభ లక్షణంగా దీన్ని పరిగణిస్తున్నారు. తాజాగా వచ్చిన ఒక అధ్యయనం ప్రకారం హోల్ బాడీ క్రయోథెరపీ అనే చికిత్సా విధానం ఈ సమస్యతో బాధపడుతున్న వారికి ఉపశమనం కలిగించే అవకాశముందని వెల్లడైంది. అంకిలోజింగ్ స్పాండిలైటిస్ అనేది వెన్నెముక, కీళ్లను ప్రభావితం చేసే దీర్ఘకాలిక ఇన్ఫ్లమేటరీ వ్యాధి. వెంటనే వైద్యులను సంప్రదించాలి..ఈ సమస్య ఉన్నవారిలో ఉదయం సమయంలో నొప్పి, బిగుతు, కదలికల్లో ఇబ్బందులు ఎక్కువగా కనిపిస్తాయి. శరీరం విశ్రాంతిలో ఉన్నప్పుడు కండరాలు గట్టిపడటం వల్ల ఉదయాన్నే నొప్పి తీవ్రమవుతుందని వైద్యులు చెబుతున్నారు. ముఖ్యంగా యువతలో ఈ సమస్య పెరుగుతున్నట్లు పరిశోధనలు సూచిస్తున్నాయి. నిపుణుల ప్రకారం కొన్ని లక్షణాలను నిర్లక్ష్యం చేయకూడదు. ఉదయం నడుము నొప్పి గంటకు పైగా కొనసాగడం, ప్రతిరోజూ పునరావృతం కావడం, విశ్రాంతి తీసుకున్నప్పుడు నొప్పి పెరగడం, కదలికలతో కొంత ఉపశమనం కలగడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచిస్తున్నారు. కుటుంబంలో ఆర్థరైటిస్ చరిత్ర ఉన్నవారు మరింత జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంటుంది. యూరోపియన్ మెడికల్ జర్నల్‌లో ప్రచురితమైన తాజా సమీక్షలో హోల్ బాడీ క్రయోథెరపీ వల్ల అంకిలోజింగ్ స్పాండిలైటిస్ రోగులకు ప్రయోజనం కలగవచ్చని వెల్లడైంది.

క్రయోథెరపీతో మెరుగైన ఫలితాలు..మొత్తం 310 మంది రోగులపై నిర్వహించిన ఐదు అధ్యయనాల డేటాను విశ్లేషించగా, ఈ థెరపీ వల్ల నొప్పి, ఉదయపు బిగుతు తగ్గినట్లు గుర్తించారు. అలాగే శరీర కదలికలు మెరుగుపడటంతోపాటు రోగుల జీవన నాణ్యత కూడా కొంత మెరుగైనట్లు అధ్యయనంలో తేలింది. క్రయోథెరపీ అనేది శరీరాన్ని అత్యల్ప ఉష్ణోగ్రతలకు కొద్దిసేపు గురిచేసే చికిత్సా విధానం. సాధారణంగా మైనస్ ఉష్ణోగ్రతల్లో 80 సెకన్ల నుంచి మూడు నిమిషాల వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుంది. దీని వల్ల శరీరంలోని ఇన్ఫ్లమేషన్ తగ్గి కండరాలు సడలుతాయి. అయితే ఇది పూర్తిస్థాయి చికిత్స కాదని, కేవలం సహాయక థెరపీగా మాత్రమే ఉపయోగించాలని స్పష్టం చేస్తున్నారు.అందరికీ పడకపోవచ్చు..అయితే ఈ థెరపీ అందరికీ అనుకూలం కాదని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

గర్భధారణ సమయంలో మహిళలకు వచ్చే ముఖ్యమైన సమస్యలు ఇవే.....

గర్భధారణ ప్రతి మహిళ జీవితంలో ఎంతో ఆనందకరమైన దశ. అయితే ఈ సమయంలో శరీరంలో అనేక మార్పులు చోటుచేసుకోవడంతో కొన్ని ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం కూడా ఉంటుంది. సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే ఇవి తల్లి, బిడ్డ ఆరోగ్యంపై ప్రభావం చూపిస్తాయి.

అందుకే గర్భధారణ సమయంలో క్రమం తప్పని వైద్య పరీక్షలు, పోషకాహారం, ఆరోగ్యకర జీవనశైలి చాలా ముఖ్యమని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా రక్తహీనత, అధిక రక్తపోటు, గర్భకాల మధుమేహం వంటి సమస్యలను ముందుగానే గుర్తిస్తే ప్రమాదాలను తగ్గించే అవకాశం ఉంటుంది. ప్రతి సంవత్సరం ఇదే విషయంపై నేషనల్ సేఫ్ మదర్‌హుడ్ డేను ఈ సమయంలో నిర్వహిస్తారు. గర్భిణీల ఆరోగ్యం, మాతృ మరణాల తగ్గింపు, సురక్షిత ప్రసవాలపై అవగాహన పెంచడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం. సరైన వైద్య సేవలు, గర్భధారణ సమయంలో పరీక్షలు, ప్రసవానంతర సంరక్షణ ప్రతి మహిళకు అందాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.గర్భస్థ సమయంలో మధుమేహం..ఇక గర్భధారణ సమయంలో ఎక్కువగా కనిపించే సమస్యల్లో గర్భకాల మధుమేహం ఒకటి. ఈ పరిస్థితిలో రక్తంలో చక్కెర స్థాయిలు పెరుగుతాయి. దీని వల్ల శిశువు అధిక బరువుతో పుట్టే అవకాశం ఉండటంతో పాటు ప్రసవ సమయంలో సమస్యలు వస్తాయి.




రొమ్ము క్యాన్సర్ లక్షణాలను గుర్తించడం ఎలా..?




ప్రస్తుతం మహిళల్లో అత్యంత సాధారణంగా కనిపిస్తున్న క్యాన్సర్‌లలో రొమ్ము క్యాన్సర్ ముందు వరుసలో ఉంది. ముఖ్యంగా 40 ఏళ్ల పైబడిన మహిళల్లో ఈ వ్యాధి వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.కానీ ప్రారంభ దశలోనే గుర్తిస్తే పూర్తిగా నయమవుతుంది. అందుకే రొమ్ములో వచ్చే మార్పులను స్వయంగా పరిశీలించడం, ఏవైనా అసాధారణ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య సలహా తీసుకోవడం చాలా ముఖ్యం. ఇలా చేయడం వల్ల చాలా మంది మహిళలు ఈ వ్యాధి నుంచి కోలుకుంటున్నారు. రొమ్ము క్యాన్సర్‌కు ప్రధాన లక్షణాలలో ఒకటి రొమ్ములో గడ్డలు లేదా ఏదో భాగం గట్టిగా అనిపించడం. ఇది తరచూ నొప్పి లేకుండా ఉంటుంది, కానీ గుర్తించకపోతే క్రమంగా పెరిగి సమస్యగా మారుతుంది. అలాగే చంకల కింద గడ్డలు కనిపించడం కూడా ముఖ్యమైన సంకేతం. ఇవి లింఫ్ నోడ్స్‌లో క్యాన్సర్ వ్యాప్తి చెందినట్లు సూచిస్తాయి. ఇంకా రొమ్ము చర్మం రంగు మారడం లేదా మసకబారడం, ఆరెంజ్ తొక్కలా మారడం వంటివి కూడా గమనించాలి. ఈ మార్పులు సాధారణంగా కనిపించకపోయినా, వచ్చినప్పుడు తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలి. చను మొన ప్రాంతంలో మార్పులు కూడా రొమ్ము క్యాన్సర్‌కు సంబంధించినవే.

భోజనం చేశాక ఈ మూడు రకాల గింజలను తినండి



భోజనం చేసిన తర్వాత కడుపు ఉబ్బరం, గ్యాస్, అసిడిటీ, భారంగా అనిపించడం వంటి సమస్యలు చాలా మందిని వేధిస్తుంటాయి. ముఖ్యంగా ఆయిల్ ఎక్కువగా ఉన్న ఆహారం లేదా భారమైన భోజనం చేసినప్పుడు జీర్ణక్రియ నెమ్మదిగా మారుతుంది. ఇలాంటి సమస్యలకు సహజసిద్ధమైన పరిష్కారంగా సోంపు, వాము, జీలకర్ర గింజలను నమలాలని నిపుణులు సూచిస్తున్నారు. సరైన మోతాదులో ఈ గింజలను తీసుకుంటే జీర్ణక్రియ మెరుగుపడటంతోపాటు పొట్ట అసౌకర్యాలు తగ్గే అవకాశం ఉందని చెబుతున్నారు. భోజనం తర్వాత ఈ మూడు గింజలను నమలడం భారతీయ సంప్రదాయంలో చాలా కాలంగా ఉంది. అయితే దీనికి శాస్త్రీయ కారణాలూ ఉన్నాయని ఆరోగ్య నిపుణులు వివరిస్తున్నారు. గింజలను నెమ్మదిగా నమలడం వల్ల వాటిలోని సహజసిద్ధమైన సంయోగాలు లాలాజలంతో కలిసి శరీరంలోకి చేరి జీర్ణక్రియను వేగవంతం చేస్తాయని చెబుతున్నారు.జీర్ణ సమస్యలకు అనేక కారణాలు..అసలు భోజనం తర్వాత జీర్ణక్రియ ఎందుకు నెమ్మదిస్తుంది అనే విషయాన్ని పరిశీలిస్తే, అధిక కొవ్వు, రిఫైన్ కార్బోహైడ్రేట్లు ఉన్న ఆహారం తీసుకున్నప్పుడు పేగులు ఆహారాన్ని జీర్ణం చేయడానికి ఎక్కువ సమయం తీసుకుంటాయి.

రెండేళ్ల తర్వాత టాలీవుడ్‌లోకి యంగ్ బ్యూటీ ఎంట్రీ..



హిందీ సినిమాలతో మెప్పించిన యంగ్ అండ్ గ్లామరస్ బ్యూటీ గాయత్రి భరద్వాజ్, తెలుగులో రొమాంటిక్, బడ్డీ, టైగర్ నాగేశ్వర రావు వంటి చిత్రాల్లో నటించినప్పటికీ ఆశించిన విజయం దక్కలేదు. దీంతో కాస్త గ్యాప్ తీసుకుని బాలీవుడ్‌లోనే బిజీ అయిపోయారు. అయితే, ఇప్పుడు దాదాపు రెండేళ్ల విరామం తర్వాత తెలుగు ఇండస్ట్రీ నుంచి ఆమెకు భారీ ఆఫర్ వచ్చింది. యంగ్ హీరో సందీప్ కిషన్ నటిస్తున్న భారీ పాన్-ఇండియా ఫాంటసీ అడ్వెంచర్ మూవీ 'కరికాల'లో గాయత్రీ భరద్వాజ్ కీలక పాత్రకు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని మేకర్స్ అధికారికంగా ప్రకటిస్తూ ప్రత్యేకంగా స్వాగతం పలికారు. 'అందమైన గాయత్రి భరత్వాజ్‌ను 'కరికాల' అద్భుత ప్రపంచంలోకి సాదరంగా ఆహ్వానిస్తున్నాం. ఇక్కడ అందం అద్భుతంతో సంగమిస్తుంది, ప్రతి కథకూ ఒక ప్రత్యేకమైన మంత్రముగ్ధత ఉంటుంది" అంటూ క్యాప్షన్ ఇచ్చారు. 'శంబాల' సినిమాతో బాక్సాఫీస్ వద్ద హ్యాట్రిక్ విజయం సాధించిన మోస్ట్ వాంటెడ్ డైరెక్టర్ యుగంధర్ ముని ఈచిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. షైనింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై రూపొందుతున్న ఈమల్టీస్టారర్ ఫాంటసీ డ్రామాలో కేథరిన్, సాక్షి అగర్వాల్ కూడా నటిస్తున్నారు. రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ పాన్-ఇండియా మూవీ తొలి భాగం 'కరికాల: చాప్టర్ 1'ను 2027 జూలై 2న, అలాగే 'కరికాల: చాప్టర్ 2'ను 2027 అక్టోబర్ 28న తెలుగు, తమిళ, హిందీ భాషల్లో విడుదల చేసేందుకు మేకర్స్ పక్కా ప్లాన్ చేస్తున్నారు.

తెలుగు పరిశ్రమకు నేను జీవితాంతం రుణపడి ఉంటాను



యంగ్ బ్యూటీ శృతి హాసన్ లోకనాయకుడు కమల్ హాసన్ వారసురాలిగా ఎంట్రీ ఇచ్చినప్పటికీ, సొంత ప్రతిభ, గ్లామర్‌తోనే తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు సంపాదించుకున్నారు. కేవలం నటిగానే కాకుండా, సింగర్‌గా, మ్యూజిక్ డైరెక్టర్‌గా మల్టీ టాలెంటెడ్ పర్సనాలిటీగా అలరిస్తున్న శృతి, కెరీర్ ప్రారంభంలో అనేక హెచ్చుతగ్గులను ఎదుర్కొన్నారు. మొదట్లో ఆమె నటించిన సినిమాలు వరుసగా ప్లాప్ అవ్వడంతో కొందరు ఆమెకు 'ఐరన్ లెగ్' అనే ముద్ర వేశారు. అలాంటి కష్ట సమయంలో అందరి సందేహాలను పటాపంచలు చేస్తూ వరుస అవకాశాలు దక్కించుకుని స్టార్ బ్యూటీగా మారారు. భారీ ప్రాజెక్ట్స్‌తో ఫుల్ బిజీగా ఉన్న శృతి.. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొని ఎమోషనల్ కామెంట్స్ చేశారు. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ 'గబ్బర్ సింగ్' సినిమా తన సినీ ప్రయాణాన్ని ఒక్కసారిగా తిప్పిరాసిందని తెలిపారు. అందరూ తనను ఐరన్ లెగ్ అని సందేహిస్తున్న సమయంలో తెలుగు ఇండస్ట్రీ తనకు అద్భుతమైన అవకాశం ఇచ్చిందని గుర్తు చేసుకున్నారు. ఆ సినిమా భారీ హిట్ అవ్వడంతోనే టాలీవుడ్‌లో వరుసగా పెద్ద ప్రాజెక్ట్‌లు వచ్చాయని చెప్పారు. అందుకే తెలుగు చిత్ర పరిశ్రమకు తాను జీవితాంతం రుణపడి ఉంటానని శృతి ఎమోషనల్ అయ్యారు.

భిన్నమైన రోల్సే నా లక్ష్యం.....



'లెనిన్'సినిమాతో భారీ విజయాన్ని సాధించిన యంగ్ బ్యూటీ భాగ్యశ్రీ బోర్సే.. వరుస చాన్స్‌లతో జోరు మీదున్నారు. 'ఆపరేషన్ గంగా' అనే యాక్షన్ సినిమాతో మలయాళ చిత్ర పరిశ్రమలోకి కూడా అడుగుపెట్టబోతున్న ఈ భామ తాజాగా, ఓ ఇంటర్వ్యూలోసినిమాల ఎంపిక గురించి ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. మనం చేసే సినిమాలను ఎలా ఎంచుకుంటాం, మనల్ని మనం ప్రేక్షకులకు ఎలా చూపించుకుంటాం అనే దానిపైనే మనకు వచ్చే పాత్రలు ఆధారపడి ఉంటాయని భాగ్యశ్రీ చెప్పారు. తాను ఇప్పటివరకు 'కాంత, లెనిన్, కింగ్‌డమ్ వంటి సినిమాల్లో విభిన్న పాత్రలతో అలరించానని తెలిపారు. ఇప్పుడు నటిగా తన లక్ష్యం అన్ని రకాల పాత్రలను వెతకడం, ప్రతి సినిమాలోనూ మరింత బాగా నటించడం అని చెప్పారు. ఏ పాత్ర ఇచ్చినా సరే దానిని అద్భుతంగా చేయగలననే గట్టి నమ్మకం తనకు ఉందని తెలిపారు. అందుకే తాను ఒకే రకమైన పాత్రలకే పరిమితం అయిపోతానేమోనని ఎప్పుడూ ఆందోళన చెందనని, భిన్నమైన పాత్రలు చేస్తూ ప్రేక్షకులను అలరించడమేనని చెప్పుకొచ్చారు.

గూస్‌బంప్స్ తెప్పిస్తున్న 'డోంట్ స్లీప్' టీజర్..



ఇంద్ర రామ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న సరికొత్త సైకలాజికల్ థ్రిల్లర్ మూవీ 'డోంట్ స్లీప్'. ఈ చిత్రంలో రవీంద్ర విజయ్, షమ్ దత్ సైనుద్దీన్ కీలక పాత్రల్లో కనిపిస్తున్నారు. 'వి డ్రీమ్ ఫిలిమ్స్' బ్యానర్‌పై ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ సినిమా ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. ప్రమోషన్స్‌లో భాగంగా మేకర్స్ ఇస్తున్న వరుస అప్‌డేట్స్‌తో సినిమాపై అంచనాలు భారీగా పెరుగుతున్నాయి. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన పవర్‌ఫుల్ టీజర్‌ను అక్కినేని నాగచైతన్య విడుదల చేశారు. డోంట్ స్లీప్' టీజర్‌ను విడుదల చేయడం తనకు చాలా సంతోషంగా ఉందని, ఈ టీజర్ చాలా ఆసక్తికరంగా, ఎంతో పదునుగా ఉందని అక్కినేని నాగచైతన్య చెప్పారు. ఈ సినిమాతో దర్శకుడిగా మారుతున్న షమ్ దత్ గారు, తన మొదటి ప్రయత్నంలోనే సరిహద్దులు దాటి కొత్తగా సినిమా తీయడం చూడటానికి చాలా ఆనందంగా ఉందని తెలిపారు. ఈ చిత్రంలో రవీంద్ర విజయ్, షమ్ దత్ సైనుద్దీన్ కీలక పాత్రల్లో కనిపిస్తున్నారు

Edited, Printed, Published & Owned by PUSALA SRINIVAS, Printed at D.K. Publications,2-3-691/1/A CPL Main Road, Amberpet, Hyderabad and Published # Do.No. 2-2-1075/20/E/1, Opp. Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13. Editor : PUSALA SRINIVAS, RNI. NO. APTEL/2008/26737. Cell: 9603754136, 9949653944 E-mail: dkchaatimpu80@gmail.com